ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 11 మే 2024

మోసం.. మనవడా..!

- ఏ నెలకు ఆ నెల తీసుకోవాల్సిందే..
- లేదంటే ఎగనామం పెట్టిన వైసీపీ ప్రభుత్వం
- టీడీపీ హయాంలో మూడు నెలలకూ మొత్తం అందజేత
- కూటమి అధికారంలోకి రాగానే మళ్లీ అదే వెసులుబాటు
- ఏప్రిల్ నుంచే పింఛన్ పెంపు.. రూ.4 వేలు అమలులోకి..
- వైసీపీ అభ్యర్థులకు గుబులు పుట్టిస్తున్న చంద్రబాబు వరాలు





పింఛన్ల పంపిణీలో మాయ

అనంతపురం, మే 10(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో అవ్వాతాతలను కూడా మోసం చేశారు. పింఛన్ల పంపిణీలో మాయ చేశారు. అధికారంలోకి రాగానే రూ.3 వేలు పింఛన్ ఇస్తామని మాటిచ్చి, వాయిదాల పద్ధతికి వెళ్లారు. ఏడాదికి రూ.250 మాత్రమే పెంచుతూ వెళ్లారు. టీడీపీ హయాంలో ఏ కారణంచేతైనా రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా, మూడో నెలలో మొత్తం పింఛన్ సొమ్ము ఇచ్చేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక.. ఏ నెల పింఛన్ ఆ నెలలో తీసుకోవాల్సిందే. లేదంటే ఆ నెల పింఛన్ ఇక అంతే..! సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అవ్వాతాతలు ఆ విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. జగన్ తమను సైతం మోసం చేశారని ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 2,88,385 మంది పింఛన్ తీసుకుంటున్నారు. మార్చిలో 2,800 మందికి పింఛన్ అందలేదు. ఏప్రిల్‌లో 1,800 మందికి ఇవ్వలేదు. ఈ నెలలో ఏకంగా 4,500 మందికి పింఛన్ అందజేయలేదు. అవ్వాతాతలతో పాటు వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు ఈ 'ఎగనామం' పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఒక నెల పింఛన్ తీసుకోకపోతే రెండో నెలలో రెండూ కలిపి ఇవ్వాలి కదా..? అలా ఎగనామం పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పింఛన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై లబ్ధిదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పింఛన్ల విషయంలో టీడీపీ కూటమి నిర్ణయానికి లబ్ధిదారులు ఫిదా అవుతున్నారు.

ఇక పింఛన్ రూ.4 వేలు



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టోలో పింఛన్ సొమ్ము రూ.4 వేలకు పెంచుతామని ప్రకటించారు. దివ్యాంగులకు ఏకంగా రూ.6 వేలు ఇస్తామని స్పష్టంగా పేర్కొన్నారు. ప్రజాగళం సభల్లో టీడీపీ అధినేత ఈ విషయాన్ని స్పష్టం చెబుతున్నారు. కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, ఏప్రిల్ నుంచే పెంచిన పింఛన్ సొమ్మును అందజేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం మే పింఛన్ సొమ్మును పంపిణీ చేసింది. కూటమి అధికారంలోకి రాగానే, చంద్రబాబు హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు వెయ్యి చొప్పున జూలై ఒకటిన అదనంగా ఇస్తారు. ఆ మూడు నెలల హామీ బకాయి రూ.3 వేలు కలిపి జూలైలో రూ.7 వేలు ఇస్తారు. ఈ హామీపై అవ్వాతాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. వైసీపీ మేనిఫెస్టోలో పింఛన్ సొమ్ము రూ.3,500 ఇస్తామని పేర్కొన్నారు. కానీ ఆ సొమ్ము 2028లో రూ.250, 2029లో రూ.250 పెంచి ఇస్తామని స్వయంగా సీఎం జగన్ చెబుతున్నారు. చంద్రబాబు, జగన్ హామీలను లబ్ధిదారులు బేరీజు వేసుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వస్తేనే తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

వైసీపీ అభ్యర్థుల్లో గుబులు

- వైసీపీ మేనిఫెస్టోలో కొత్తదనం ఏమీ లేదు. పాత మేనిఫెస్టోలో కొన్నింటి లబ్ధిని అరకొరగా పెంచారు. జాబ్ క్యాలెండర్ హామీని విస్మరించారు. టీడీపీ మేనిఫెస్టోలో ఏడాదికి 4 లక్షలు చొప్పున ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ కారణంగా నిరుద్యోగ యువత వైసీపీకి దూరమవుతోంది. ఆ పార్టీ అభ్యర్థులను అభద్రతాభావం వెంటాడుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో మహిళలు కూడా కూటమి వైపే చూస్తున్నారు. వైసీపీ అభ్యర్థుల్లో నైరాశ్యం నెలకొంది.
- కూటమి మేనిఫెస్టో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూర్చేలా ఉంది. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ప్రకటించారు. ఇక ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఇప్పటికే వైసీపీకి వ్యతిరేకంగా పోస్టల్ బ్యాలెట్ ఓటేశారు. ఇది వరకూ ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 80 శాతం ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు. తాజా పరిస్థితులు వైసీపీ అభ్యర్థులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

ఎన్నికలకోసం అదనపు బస్సు సర్వీసులు

అనంతపురం కల్చరల్, మే 10: సార్వత్రిక ఎన్నికల కోసం ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని శుక్రవారం తెలిపారు. సాధారణ రోజుల్లో తిరిగే బస్సులు కాకుండా శనివారం 25, ఆదివారం 14 బస్సులను అదనంగా నడుపుతామని ఆయన తెలిపారు. ఎన్నికల సిబ్బంది, సామగ్రి తరలింపకోసం ఆదివారం ఉదయం నుంచి అన్ని డిపోల పరిధిలో 272 బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆరింటికి ఆపేయండి..!

అనంతపురం టౌన్, మే 10: ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి బ్రేక్ పడనుంది. గత 20 రోజులుగా ప్రధాన పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ ముగిసే 48 గంటల ముందు అభ్యర్థులు, పార్టీలు ప్రచారం చేయకూడదు. ఆ మేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు అన్ని పార్టీలు, అభ్యర్థులు ప్రచారాన్ని ముగించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. ఆ తర్వాత ప్రచారం చేసినా, ర్యాలీలు నిర్వహించినా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాస్టార్ల మీటింగ్‌పై ఫిర్యాదు?

అనంతపురం విద్య, మే 10: ఎన్నికల సమయంలో ఏపీటీఎఫ్ నాయకులు సమావేశం ఏర్పాటు చేయడంపట్ల ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆ యూనియన్ నాయకులను, రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎంను శుక్రవారం విచారించినట్లు తెలిసింది. ఆ పాఠశాలలో ఎలాంటి సమావేశం నిర్వహించలేదని నాయకులు, హెచ్‌ఎం వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో కొందరిని కాపాడేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌ను బురిడీ కొట్టించేందుకు ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం.

26న కలుసుకున్నారా..?

అనంతపురం నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌కు గత నెల 26న ఏపీటీఎఫ్ నాయకులు భారీ సంఖ్యలో వెళ్లారు. జిల్లా కౌన్సిల్ సమావేశం నెపంతో ఉద్యోగులు, సంఘాల నాయకులు ఒక చోట సమావేశం కావడంతో ఫిర్యాదులు వెళ్లాయి. ఎన్నికల సమయంలో అనుమతి లేకుండా సమావేశం నిర్వహించారని సి-విజిల్ యాప్, ఇతర రూపాల్లో ఎన్నికల సంఘానికి కొందరు ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాలతో విచారించాలని కలెక్టర్ నుంచి డీఈఓకు మూడు రోజుల కిందటే ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో డీఈఓ వరలక్ష్మి రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామాంజులును ఆఫీస్‌కు పిలిపించి, విచారించాని సమాచారం. సమావేశం నిర్వహణపై హెచ్‌ఎం ద్వారా లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కులశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకుడు శ్రీనివాసులు రెడ్డిపై సి-విజిల్‌లో ఫిర్యాదులు వెళ్లడంతో వారిని కూడా డీఈఓ విచారణకు పిలిచినట్లు సమాచారం. జిల్లా విద్యాశాఖాధికారులకు కులశేఖర్‌రెడ్డి సంజాయిషీ ఇచ్చినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది.

కాపాడేందుకు ప్రయత్నాలు

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సమావేశంలో పాల్గొన్న కొందరిని కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సమావేశంలో పాల్గొన్న వారి ఫొటోలు, వీడియోలను కొందరు ఎన్నికల సంఘానికి పంపినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి సమావేశం వీడియో, ఫొటోలు తీసినట్లు చర్చ సాగుతోంది. అయితే అక్కడ సమావేశం జరగలేదని డీఈఓకు స్కూల్ హెచ్‌ఎం సంజాయిషీ ఇచ్చారని తెలిసింది. ఒక నాయకుడు సైతం ఇదే తరహాలో సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు డీఈఓ ఎలాంటి నివేదిక ఇస్తారోనన్న చర్చ సాగుతోంది.

మా అస్త్రం సూపర్ సిక్స్

ఉరవకొండ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- టీడీపీ కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఉరవకొండ, మే 10: 'నా హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప.. ఉరవకొండ నియోజకవర్గంలో కొత్తగా చేసేందిమీ లేదు. మరోసారి అవకాశం ఇస్తే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తాను. సూపర్ సిక్స్ పథకాలే మా అస్త్రం. నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్యలకు పరిష్కారం చూపుతాను. హంద్రీనీవా నీటితో ఆయకట్టును కోనసీమ తరహాలో అభివృద్ధి చేస్తాను' అని టీడీపీ కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన ఆంధ్రజ్యోతితో శుక్రవారం మాట్లాడారు.

● ఎలాంటి వ్యూహాలతో అధికార పార్టీని ఎదుర్కోబోతున్నారు ?

కేశవ్: వైసీపీ ప్రభుత్వంపై నిరుద్యోగులు, ఉద్యోగులు, యువకులు, రైతుల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. ప్రభుత్వంపై వారు కసిగా ఉన్నారు. వైసీపీని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారు. నన్ను గెలిపిస్తే ఎన్డీఏ సహకారంతో కేంద్రం నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాను. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలే అజెండాగా పనిచేస్తాను.

● డ్రీమ్ ప్రాజెక్టులు ఏవైనా ఉన్నాయా? గెలిస్తే నిధులు ఎలా సమకూరుస్తారు?

కేశవ్: సాగు, తాగునీరు, విద్య, వైద్యం, పరిశ్రమల రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. ఆగిపోయిన సామూహిక బిందుసేద్యం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని 80వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు తెచ్చి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం.

● ఓటర్లకు ఇస్తున్న భరోసాలు, హామీలు ఏమిటి?

కేశవ్: సూపర్‌సిక్స్ పథకాలతో మేనిఫెస్టోలోని అంశాలు ప్రజలకు వివరిస్తున్నాం. ఉపాధి, విద్యాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాం. పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం. గార్మెంట్ పరిశ్రమను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పిస్తాం. రహదారులను అనుసంధానం చేసి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం. అధికారంలోకి వచ్చిన వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

● మీ ప్రచారానికి ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది?

కేశవ్: ప్రచారానికి గ్రామాలకు వెళ్లినపుడు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్నారు. ప్రభుత్వంపైన అన్ని వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 1994 ఫలితాలు పునరావృతం కావడం తథ్యం.

● గతంలో మీరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి?

కేశవ్: టీడీపీ హయాంలో ఉరవకొండలో 50 పడకల ఆసుపత్రి నిర్మించాం. మూడు రహదారులను ఏర్పాటు చేశాం. హంద్రీనీవా ద్వారా 11 చెరువులకు నీరిచ్చాం. డిగ్రీ కళాశాలను మంజూరు చేయించి, భవన నిర్మాణం చేపట్టాం. ఉరవకొండలో డబుల్ రోడ్ నిర్మాణాన్ని చేపట్టాం. పీఏబీఆర్ నుంచి ఉరవకొండకు ప్రత్యేక తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశాం. గుంతకల్లు బ్రాంచికెనాల్ ఆధునికీకరణ పనులు చేపట్టాం. ఉరవకొండలో 3వేల మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశాం.

● ఉరవకొండలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు కదా..?

కేశవ్: మా ప్రభుత్వ హయాంలో ఉరవకొండకు రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా చేశాం. ఉరవకొండలో నీటి ఎద్దడికి వైసీపీ నాయకులే కారణం. పథకాలపై కనీస అవగాహన లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే నీటి సమస్యను పరిష్కరిస్తాం.

● గెలిచిన తర్వాత మీ ప్రాధాన్యాలు ఏమిటి..?

కేశవ్: సాగు, తాగునీరు, రహదారులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. జీడిపల్లి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధుల మంజూరుకు కృషి చేస్తాను. హంద్రీనీవా కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తాం. అవకాశం ఉన్న ప్రతి ఎకరానికీ సాగునీటిని అందిస్తాం.

● ముస్లింల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కేశవ్: ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం ఉంటుంది. రూ.100 కోట్లతో నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం. హజ్‌యాత్రకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తాం. ఇమాంలకు ప్రతినెలా రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తాం. 2014లో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఆ ఐదేళ్ల కాలంలో ముస్లిం మైనార్టీల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేశాం. దుల్హన్, రంజాన్ తోఫా ఇచ్చాం. పదుల సంఖ్యలో షాదీఖానాలు నిర్మించాం. 2024లోనూ కూటమిదే అధికారం. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన ముస్లిం మైనార్టీల పథకాలను పునరుద్ధరిస్తాం.

అభివృద్ధిని కళ్లకు కట్టినట్టు చూపిస్తా!

- ఒక్క అవకాశం ఇవ్వండి.. టీడీపీని గెలిపించండి
- కూటమి కళ్యాణదుర్గం అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు





ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలు ఒక్క చాన్స్ ఇచ్చి టీడీపీని గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో కళ్లకు కట్టినట్లు చూపిస్తానని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలబెట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. వైసీపీ పాలనపై విసుగుచెంది, చంద్రబాబు నాయుడు పాలన వైపు ప్రతి ఒక్కరూ మొగ్గు చూపుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో రోజురోజుకూ టీడీపీ బలం పుంజుకుంటోందని అన్నారు. ఆ ప్రజాబలంతోనే కళ్యాణదుర్గంలో 50 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో వైసీపీ వర్గీయులు టీడీపీలోకి భారీగా చేరారని అన్నారు. చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితే తమ తలరాతలు మారుతాయన్న దృఢ సంకల్పంతో ఉన్నారని అన్నారు. కళ్యాణదుర్గంలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

● వైసీపీ ప్రభుత్వం గురించి ప్రజలు ఏమంటున్నారు?

అమిలినేని: ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. ఏ గ్రామానికి వెళ్లినా వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారే అధికంగా కనిపిస్తున్నారు. ఆ పార్టీ నాయకుల దౌర్జన్యాలు, బెదిరింపులు, అవినీతి తారస్థాయికి చేరాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది.

● ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

అమిలినేని: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీకి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఏ గ్రామంలో చూసినా ప్రజలు టీడీపీ పాలనను కోరుకుంటున్నారు.

● వలసల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటారు ?

అమిలినేని: గడిచిన ఐదేళ్లలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వలసలను పాలకులు ఏ మాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు. బెంగళూరులో ఎక్కడ చూసినా వలస వెళ్లిన కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలే అధికంగా కనిపిస్తారు. టీడీపీ అధికారంలోకి వస్తే స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాం. వలస వెళ్లిన వారందరినీ గుర్తించి, సొంత ప్రాంతాలకు రప్పిస్తాం. స్థానికంగా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

● నియోజకవర్గ ప్రజల జీవనాడి అయిన బీటీపీ ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారు ?

అమిలినేని: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీటీపీ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తాం. రెండున్నరేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ ఐదేళ్లలో బీటీపీ ప్రాజెక్టు పనులకు సంబంధించి గంపెడు మట్టి తీసిన పాపాన పోలేదు. ప్రత్యేక చొరవ తీసుకుని, చంద్రబాబుతో మాట్లాడి నిధులు తెప్పించుకుంటాం. రెండున్నరేళ్లలో పనులు పూర్తి చేసి, సాగు, తాగునీరు అందిస్తాం.

● నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధి, రైతాంగ సమస్యలపై ఎటువంటి దృష్టి సారిస్తారు ?

అమిలినేని: బీటీపీ కాలువ పనులు పూర్తి చేసి, నియోజకవర్గంలోని 114 చెరువులకు సాగు, తాగునీరు అందిస్తాం. రైతాంగాన్ని ఆదుకుంటాం. నియోజకవర్గంలోని చెరువుల మరమ్మతులు, అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతాం. కళ్యాణదుర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం.

● కళ్యాణదుర్గం మున్సిపాలిటీని ఏవిధంగా అభివృద్ధి చేస్తారు ?

అమిలినేని: వైసీపీ ఐదేళ్ల పాలనలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అధ్వాన్న స్థితికి చేరింది. ఎక్కడ చూసినా మురుగు నీరు కనిపిస్తోంది. టీడీపీ అధికారంలోకి వస్తే పక్కా ప్రణాళికతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం. వీధులను శుభ్రం చేయిస్తాం. పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం.

● పట్టణంలో తాగునీటి సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తారు ?

అమిలినేని: ఇంటింటికీ కొళాయిలు వేయిస్తాం. తాగునీటిని సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం. గ్రామాల్లో ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తాం. వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ కార్యాలయ భవనాన్ని రాత్రికి రాత్రే కూల్చివేశారు. దీంతో అక్కడ ఉపాధి పొందేవారు రోడ్డున పడ్డారు. ఆ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించి, కాంప్లెక్స్ గదులు నిర్మించి నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తాం.

● రైతు సంక్షేమానికి ఏవిధంగా కృషి చేస్తారు ?

అమిలినేని: రైతు సంక్షేమానికి మా ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. వ్యవసాయానికి తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తాం. సబ్సిడీతో సౌర పంపుసెట్లు అందిస్తాం. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వనున్నాం. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తాం. కౌలు రైతులకు గుర్తింపుకార్డులు, పంటల బీమా ఇస్తాం. రైతు కూలీలకు కార్పొరేషన్ స్థాపించి రాయితీలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తాం. బిందుసేద్యపు పరికరాలను 90 శాతం సబ్సిడీతో అందజేస్తాం. సేంద్రీయ వ్యవసాయం చేపట్టే వారికి ఆర్థికంగా సాగు, మార్కెటింగ్ అంశాలలో తోడ్పాటు కల్పిస్తాం.

● టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఎటువంటి ప్రాధాన్యం ఇస్తారు ?

అమిలినేని: కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 19 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు ప్రతినెల రూ.1500 అందజేస్తాం. ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తాం. తద్వారా ఆర్థిక భరోసా కలుగుతుంది. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు రూ.3 లక్షలు నుంచి రూ.పది లక్షలకు పెంచుతాం. ఆశా వర్కర్ల కనీస వేతనం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. బడికి వెళ్లే విద్యార్థికి ఏటా రూ.15 వేలు ఇస్తాం. ప్రైవేటు ఉద్యోగాలు చేసే మహిళలకు హాస్టల్ వసతి కల్పిస్తాం.

● బీసీలకు ఎటువంటి ప్రాధాన్యం ఇస్తారు ?

అమిలినేని: బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4 వేలు పింఛన్ ఇస్తాం. ఉప ప్రణాళిక ద్వారా ఐదేళ్లలో రూ.1.50 లక్ష కోట్లు ఖర్చుచేస్తాం. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తాం. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేస్తాం. ఇసుక ఉచితంగా అందించి, భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలుస్తాం. ఆదరణ పథకం కింద వృత్తి పరికరాలు అందిస్తాం.

● మండలాల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపడతారు ?

అమిలినేని: కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల పరిధిలో సమస్యలను గుర్తించి, అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాం. ఈ మండల కేంద్రాల్లో రహదారులను అభివృద్ధి చేస్తాం. మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయించి స్థానికంగా ఉపాధి కల్పిస్తాం. మండల కేంద్రాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తాం. ఆదర్శ మండలాలుగా తీర్చిదిద్దుతాం. - కళ్యాణదుర్గం

మీ ఊళ్లో పండుగకు వస్తా

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, మే 10: ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికలు జరిగేలా సహకరిస్తే ప్రతి ఊళ్లో జరిగే పండుగకు తాను వస్తానని వివిధ పార్టీల అభ్యర్థులతో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పార్టీలు, అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. 13వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. కలెక్టరేట్‌లో లైజనింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని, ఏ విషయమైనా అక్కడ తెలియజేయవచ్చని, వెంటనే పరిష్కారానికి కృషిచేస్తామని అన్నారు. గొడవలు లేకుండా ఎన్నికలు జరిగేలా సహకరించాలని విన్నవించారు. అలా చేస్తే ఊళ్లలో జరిగే పండుగలకు ఎస్పీతో కలిసి వస్తానని, అప్పుడు గ్రామ అభివృద్ధి గురించి చర్చించుకోవచ్చని అన్నారు.

ప్రశాంతంగా ముగిద్దాం

మిగిలిన మూడు రోజులు సమర్థవంతంగా పనిచేసి.. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా చూడాలని అధికారులు, పోలీసులు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. జేఎన్‌టీయులో ఎస్పీ అమిత్ బర్దర్‌తో కలిసి శుక్రవారం ఆయన సెక్టోరియల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లతో సమావేశం నిర్వహించారు. ప్రీపోల్, పోల్ డే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. సమస్యలు ఉత్పన్నమైతే ఒత్తిడి, భయానికి లోనుకాకుండా.. కలిసి ఎదుర్కోవాలని అన్నారు.

పోలింగ్ స్వేచ్ఛగా సాగాలి

ఎస్పీ అమిత్ బర్దర్

అనంతపురం క్రైం, మే 10: జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలన్నదే లక్ష్యమని ఎస్పీ అమిత్ బర్దర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్ల పరిధిలో ఏ అభ్యర్థినీ అనుమతించరాదని అన్నారు. ఒకే పోలింగ్ స్టేషన్‌లో రెండు మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్నా.. 200 మీటర్ల పరిధిని పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. అభ్యర్థులు, అధికారులు, పోలీసులు మాత్రమే వంద మీటర్ల పరిధిలో సెల్‌ఫోన్లు వినియోగించవచ్చని, ఇతరులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసులు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఓటర్లను తరలించడం నేరమని అన్నారు. పోలింగ్ జరిగే ప్రాంతంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయని తెలిపారు. పోలింగ్ దృష్ట్యా శనివారం నుంచి 14వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు కొనసాగుతుందని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఎలాంటి రాజకీయ ప్రచార కార్యక్రమాలు, టెంట్లు నిర్వహించరాదని అన్నారు. పోలింగ్‌కు అంతరాయం కలిగించినా, ప్రలోభాలకు గురి చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అభ్యర్థితో పాటు గన్‌మెన్ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లడం నిషేధమని అన్నారు. మద్యం దుకాణాలను శనివారం సాయంత్రం 5గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మూసివేయిస్తున్నామని తెలిపారు.

వదల బొమ్మాళీ వదల..!



తాము రాజీనామా చేసినా తమ పరిధిలోని ఓటర్లను మాత్రం వలంటీర్లు వదలడం లేదు. అధికార పార్టీకి సాయంగా గుట్టు చప్పుడు కాకుండా ప్రలోభ పెడుతూనే ఉన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లకు ఆయా నియోజక వర్గ అధికార పార్టీ అభ్యర్థులు వేతనాలు ఇచ్చి ఈ పనులకు పురమాయిస్తున్న ట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే వలంటీర్లు ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమానికి తెర తీశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. అనంతపురం అర్బన్ వైసీపీ అభ్యర్థి తమ పరిధిలోని వలంటీర్ల ద్వారా ఓటర్లకు నగదు పంపిణీ చేపట్టారనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చాలా వరకు నగదు పంపిణీ చేశారని తెలుస్తోంది. కొందరు వలంటీర్లు నగదు పంపిణీకి అంగీకరించకపోవడంతో ఆయా ప్రాంతాల వైసీపీ వర్గీయులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదంతా గుట్టుచప్పుడు కాకుండా ఓట్ల కోసం వైసీపీ సాగిస్తున్న అక్రమ వ్యవహారమనే చర్చ నగరంలో సాగుతోంది.

- అనంతపురం సిటీ

ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయండి



అనంతపురం టౌన్, మే 10: ఎన్నికలకు సంబంధించి ఎక్కడ ఎలాంటి అక్రమాలు, సంఘటనలు జరిగినా.. సమస్యలు ఏర్పడినా ఫిర్యాదు చేయడానికి జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదులు చేయడానికి టోల్ ఫ్రీ నెంబర్లు కేటాయించారు. 08554-231722, 08554-232922, 08554-231922, 18004258802, 18004258803, 188004258804 ఈ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చు. ఫిర్యాదులపై 100 నిమిషాలలోనే అధికారులు స్పందించి వాటిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటారు.

పరిశీలకులకు కూడా.. ఎన్నికల పరిశీలన కోసం జిల్లాకు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక పరిశీలకులను పంపించింది. ఎక్కడైనా ఇబ్బందులు, సమస్యలు ఏర్పడితే వీరికి కూడా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. అనంతపురం పార్లమెంటు ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు.. అజయ్‌నాథ్ (8919756419), రవికుమార్ (8247810416), వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే (9408794122), రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్ (8247832873), అనంతపురం, రాప్తాడు, కళ్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రాందాస్ టి.కాలే (8074550860) ఈనెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఓటెయ్యాలా.. డ్యూటీ చేయాలా..?



ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ప్రథమ చికిత్స కేంద్రంలో విధులు కేటాయించడంతో తామెలా ఓటు హక్కు వినియోగించుకోవాలని పలువురు వైద్యసిబ్బంది ప్రశ్నిస్తున్నా రు. జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి కేంద్రానికి ఒక నర్సు, ఒక ఆశా కార్యకర్తను నియమించారు. వీరి పర్యవేక్షణకు డాక్టర్లను ఏర్పాటు చేశారు. ఈలెక్కన దాదాపు ఐదువేల మంది వైద్య సిబ్బంది ఎన్నికల డ్యూటీలో ఉండనున్నారు. ఇప్పుడు ఇదే సమస్యగా మారింది. ఎన్నికల కేంద్రాల వద్ద డ్యూటీ ఉంటే ఓటు మరో చోట ఉన్న వాళ్లు ఎలా ఓటు హక్కు వినియోగించుకుంటారనే చర్చ నడుస్తోంది. గతంలో ఇలా డ్యూటీలకు వెళ్లే వైద్య సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేవారు. ఈసారి అలాచేయకుండా డ్యూటీలు వేసేయడంతో అయోమయం నెల కొంది. దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ.దేవిని అడిగితే ఓటు ఎక్కడ ఉంటే అక్కడే వారికి డ్యూటీ వేస్తున్నామని, ఒకవేళ ఓటు మరోచోట ఉన్నా అలాంటి వారిని పంపించి ఓటు వేసి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఇప్పటికే డాక్టర్లకు ఈమేరకు ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

- అనంతపురం టౌన్




చెత్తతో నిండిన మరువవంక

ఏలికా.. మీ మాట మరువలేం

- చెత్తా చెదారంతో నిండిన మరువవంక

అనంతపురం సిటీ: నగరంలోని మరువవంకలో చెత్తా చెదారం నిండిపోవడంతో డ్రైనేజీ నీరు ముందుకుసాగడం లేదు. ప్రధానంగా ఐరన్‌బ్రిడ్జి, సూర్యనగర్ వెంబడి ఉన్న మరువవంకలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు, కుప్పలుగా పడింది. దీంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. వర్షం వచ్చిన సమయంలో మరింత ఇబ్బందికరంగా మారుతోంది. బయటినుంచి డ్రైనేజీ, వర్షపు నీరు సైతం ఆ కాలువలోకి రాకుండా చెత్తచెదారం అడ్డుగా ఉండటంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం దుర్వాసన వస్తుండటంతో మరువవంకకాలువ సమీపంలో నివాసం ఉండే ప్రజలు పరిస్థితి దారుణంగా మారింది. గత ఎన్నికల సందర్భంగా నగరంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే గెలిచాక అటువైపు ఆలోచనే చేయడం లేదని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరువవంక సమీపంలోని ప్రజలను కదిలిస్తే తమను మురుగు దుర్గంధానికి వదిలేసిన నాయకులకు 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెబుతామని పేర్కొంటున్నారు.

జగన్ మార్కు అభివృద్ధి ఇదే..!



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

అనంతపురం సెంట్రల్, మే 10: అభివృద్ధి అంటే ఏమిటో తమ ప్రభుత్వాన్ని చూసి నేర్చుకోవాలని సీఎం జగన్ తరచూ చెప్పే మాటలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో రోడ్లు సరిగాలేవు. మురుగు కాలువలు అసలే లేవు. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. బళ్లారి బైపాస్ ఎంవైఆర్ కల్యాణమండపం నుంచి నగరం వైపు కిలోమీటరు దూరం వరకు ఏళ్లతరబడి మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఆ పరిసర ప్రాంతంలో అనేక రంగాల కార్మికులు, దుకాణాదారులు, వ్యాపారులు ఉన్నారు. ఇది బళ్లారి, హొస్పేట్, హంపీ, గోవాకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనదారులు ఈ మురుగును దాటుకుని వెళ్తుంటారు. సంవత్సరాలు గడిచినా కాలువను మరమ్మతు చేయకుండా మురుగును రోడ్డుపై వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా కళ్లముందు కనిపించే అభివృద్ధి జగన్ అంటూ ఎద్దేవా చేస్తున్నారు.

ఐదేళ్లూ.. పస్తులే..!

పట్టెడన్నమూ కరువేనా జగన్ మామయ్యా..?


ఇంటర్ విద్యార్థుల ఆకలి బాధలు

నాడు కడుపు నింపిన చంద్రబాబు

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు

ఉద్యమించిన నేతలపైనా కేసులు





అనంతపురం విద్య: విద్యార్థులకు మామయ్యను అని చెప్పుకునే జగన్‌రెడ్డి.. ఈ ఐదేళ్లలో ఇంటర్ విద్యార్థులకు నాలుగు మెతుకులు కూడా అందించలేకపోయారు. మీ మామయ్యను అంటూ చెప్పుకుని...పిల్లల తల్లి దండ్రులలో ఓట్లు వేయించుకుని 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్.. ఇంటర్ పిల్లలు కాలే కడుపులతోనే చదువుకునేలా చేశారు. పల్లెల నుంచి పట్టణాల్లోని జూనియర్ కళాశాలలకు ఆకలి కడుపులతో వచ్చి చదువుకుంటున్నారన్న విషయం తెలుసుకున్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2018, 2019లో ఇంటర్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించారు. వేలాది మంది ఇంటర్ విద్యార్థుల కడుపు నింపారు. 2019లో సీఎం పీఠంపై కూర్చొన్న జగన్.. నిర్లక్ష్యంగా ఇంటర్ పిల్లల కడుపుపై కొట్టారు.

టీడీపీ హయాంలో మధ్యాహ్న భోజనం

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా గత ప్రభుత్వం నడిచింది. ముఖ్యంగా ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా భోజనం అందించాలన్న సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారు. 2018, 2019 సంవత్సరాల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. పాఠశాల విద్యార్థులే కాకుండా ఇంటర్ చదువుకునే విద్యార్థులు సైతం కడుపు నిండా భోజనం చేయాలన్న సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 42 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 18,061 మంది విద్యార్థులకు నిత్యం మధ్యాహ్న భోజనం అందించేవారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తయా రు చేయించి, జూనియర్ కళాశాలలకు తెప్పించి పిల్లలకు కడుపు నింపారు. పల్లెటూరి నుంచి పట్టణాల్లోని జూనియర్ కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ఇది ఎంతో దోహదపడింది.

విద్యార్థుల కడుపు మాడ్చిన మామయ్య

2019లో అధికారంలో వచ్చిన జగన్ ఇంటర్ విద్యార్థులను గాలికి వదిలేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెడితే...తాను ఎందుకు లన్నట్టుగా వ్యవహరించిన జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని ఆపేశారు. ఇంటర్ విద్యార్థులకు ఏనాడూ భోజనం పెట్టలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 జూనియర్ కళాశాలల్లో ఏకంగా లక్ష మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం అందకుండా కోల్పోయారు. పట్టణాలకు వస్తున్న వేలాది మంది ఇంటర్ విద్యార్థులు కాలే కడుపులతోనే చదువుకోవాల్సిన దుస్థితికి తీసుకొచ్చారు. విద్యార్థుల కడుపు మాడ్చవద్దని, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్ కళాశాలల్లో సైతం అమలు చేయాలంటూ టీఎన్ఎస్ఎఫ్ ఇతర విద్యార్థి సంఘాల నాయకులు ఉద్యమించారు. విద్యార్థుల తరపున ఆర్ఐఓ ఆఫీస్ వద్ద పోరాటం చేసిన నేరానికి, విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టారు. పిల్లలకు భోజనం పెట్టాలని ధర్నా చేశారని అధికార మదంతో సుమారు 12 మందిపై అక్రమ కేసులు కూడా పెట్టించడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇంటర్ పిల్లల పాలిట కంసమామ

జగన్‌రెడ్డి గత ఎన్నికల్లో విద్యార్థుల పేరు చెప్పుకుని వారి తల్లిదండ్రుల ఓట్లు దండుకున్నాడు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం కూడా పెట్టకుండా చేశాడు. మామయ్యను అంటూనే...ఆ విద్యార్థుల పాలిట కంస మామగా మారాడు. ఇంటర్‌లో మధ్యాహ్నభోజనం అమలు చేయాలని విద్యార్థి సంఘాల నేతలుగా ఆందోళనలు చేపడితే మాపై కేసులు కూడా పెట్టాడు. దాదాపు నాలుగేళ్లు కోర్టుల చుట్టూ తిప్పాడు. పేద విద్యార్థుల కడుపు మాడ్చిన జగన్‌కు ఈ ఎన్నికల్లో పతనం తప్పదు.

- బండి పరశురాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎన్ఎస్ఎఫ్



ఇంటర్ విద్యార్థుల పొట్టకొట్టారు

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక చర్యలు తీసుకున్నారు. పల్లెల నుంచి వచ్చే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం అందించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ ఐదేళ్లలో విద్యార్థులకు తీరని అన్యాయం చేశారు. లక్షలాది మంది విద్యార్థుల కడుపు మాడ్చారు. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తూ పేద విద్యార్థుల కడుపుకొట్టారు. జగన్ ప్రభుత్వానికి తల్లిదండ్రుల చేతిలో ఓటమి ఖాయం.

- లక్ష్మీ నరసింహ, తెలుగుయువత రాష్ట్ర అధికారి ప్రతినిధి

ఓటేసికి రాండన్నో..!

వలస ఓటర్లను రప్పించేందుకు పార్టీల యత్నాలు

వివిధ ప్రాంతాల నుంచి ఉత్సాహంగా వస్తున్న ఓటర్లు

బుక్కరాయసముద్రంం, మే 10: స్థానిక సంస్థల ఎన్నికలను తలపించే విధంగా ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. వృత్తి, ఉ పాధి రీత్యా హైదరాబాద్, బెంగళూరు, పూణే , ముంబై తదితర నగరాలకు వలసవెళ్లిన వారందరూ ఓటు వేయడానికి సొంతూళ్లకు వస్తున్నా రు. వరుసగా సెలవులు రావడం కూడా సొం తూరి ప్రయాణానికి వారిలో ఉత్సాహం నింపుతోంది.



ఖర్చు మాదే..!

ప్రస్తుతం ఎన్నికలు హోరాహోరీగా ఉండటంతో ప్రతి ఓటు కీలకంగా మారింది. దీంతో శింగనమల నియోజకవర్గం ఓటర్లు ఏయో ప్రాంతా ల్లో ఉన్నారో.. గుర్తించి వారిని పిలిపిస్తున్నారు. ఎంత ఖర్చైనా మనమే భరిద్దాం అంటూ అభ్యర్థులు తమ కేడర్‌కు సూచిస్తున్నారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఉపాధి రీత్యా వేరే ప్రాం తాలకు వెళ్లిన వారిని ఎక్కడున్నా సరే పిలిపించి ఓటు వేయించేందుకు ఆయా పార్టీల నాయకులు సిద్ధమయ్యారు. ఐటీ సహా ఇతర ఉద్యోగాల కోసం వెళ్లిన ప్రతి ఒక్కరికి ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు.

బస్సు, ట్రైన్‌లు కిటకిట

ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలలో నుంచి రావాలంటే బస్సులు, ట్రైన్‌లు కిటకిట లాడుతున్నాయి. ఈనెల 13న పోలింగ్ జరుగుతుండటంతో పాటు మూడు రోజుల సెలవులు రావడంతో సొంత గ్రామాలకు రావడానికి పెద్ద సంఖ్యలో ఓటర్లు గ్రామాల బాట పడుతున్నారు. ప్రైవేటు, ఆర్టీసీ, రైలులో టికెట్లు ఇప్పటి ఫుల్ కావడంతో వచ్చేందుకు వలస ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. టిక్కెట్లు ఖర్చు ఇస్తాము.. కానీ బుక్ చేయలేమని పార్టీ కేడర్ వారికి చెబుతోంది. గ్రామంలో నలుగురైదుగురు ఉంటే కారు సిద్ధం చేసుకోండి ఖర్చు భరిస్తామని పార్టీ నేతల ఆఫర్ ఇస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో వలస ఓటర్లు దాదాపు 2500 మందిపైగా ఉన్నట్లు తెలిసింది.

దళితులపై తోపుదుర్తి అరాచకం



దాడిలో గాయపడిన వన్నూరప్ప (ఫైల్)

● దాడులతో భయాందోళన ● బి.యాలేరులో 270 మంది పట్టాల రద్దు

ఆత్మకూరు, మే 10 : వైసీపీ నేతలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై వివక్ష చూపడమే కాదు.. ఎక్కడ చూసినా దాడులకు పాల్పడుతూ భయాందోళనకు గురి చేస్తున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరులు, అనుచరులు దాడులు చేస్తూ ఆ వర్గాలను భయభ్రాంతులుకు గురిచేస్తున్నారు. ప్రతిపక్షనాయకులపైనే కాకుండా సొంత పార్టీ నాయకులపైనా దాడులు చేశారు. దీంతో టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి.ఆత్మకూరు మండల వ్యాప్తంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలపై పలుమార్లు దాడులకు తెగబడ్డారు. బి.యాలేరు గ్రామంలో పట్టాలు పంపిణీలో దళితులకు అన్యాయం జరిగింది. 2019లో అప్పటి మంత్రి పరిటాల సునీత 270 మందికి ఇంటి పట్టాలు అందజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దళిత లబ్ధిదారులకు ఎలాంటి నోటీలు ఇవ్వకుండా పట్టాలు రద్దు చేయించారు. దళితులను పక్కన పెట్టి సొంత సామాజిక వర్గంతో పాటు మరికొందరకి పట్టాలు ఇచ్చారు. పట్టాల పంపిణీ సందర్భంగా దళితులను నుంచి నిరసనలు తలెత్తకుండా ముందస్తు అరెస్టులు చేశారు. బి. యాలేరు దళితులు పట్టాలు పంపిణీ చేయాలని కోర్టుకు వెళ్లడంతో పాటు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయింది.

తోపుదుర్తిలో దళితులపై అరాచకం

తోపుదుర్తి గ్రామంలో దళితులపై ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర రెడ్డి అనుచరులు అరాచకంతో గ్రామంలో భయాందోళనలు కలిగించాయి. గ్రామానికి చెందిన మాల వన్నూరప్పను ఇంటిదగ్గర నుంచి బలవంతంగా ఎమ్మెల్యే ఇంటిదగ్గరకు తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో వన్నూరప్పకు వీపుపై తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి దళితులు గ్రామంలో ఎప్పుడు ఏమి జరుగుతోందని ఆందోళనతో బతుకుతున్నారు. తోపుదుర్తి సోదరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని జిల్లా పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. తోపుదుర్తిలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. వడ్డుపల్లిలో గడపగడపకు వచ్చిన సమయంలో సొంత పార్టీకి చెందిన దళితులు తమ సమస్యలు పరిష్కరించలేదని నిలదీశారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే వారిని స్టేషన్ చుట్టే తిప్పారు. ఆత్మకూరు దళిత కాలనీలో వైసీపీ సర్పంచ్ సోదరుడు టీడీపీలో చేరడంతో పార్టీలో ఎలా చేరుతావ్ అంటూ స్థానిక నాయకులు బెదిరించారు.

ఎమ్మెల్యేకు దళితులు అంటే పడదు



రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మొదటి నుంచి దళితులు అంటే పడదు. అధికారంలోకి వచ్చీరాగానే గ్రామంలో 270 మంది పట్టాలను రద్దు చేసి వారి కడుపుకొట్టాడు. అప్పటి నుంచి మండలంలో చాలామంది దళితులపై వివక్ష చూపుతూ పాలనసాగిస్తున్నాడు. మరోసారి ఎన్నికలు వచ్చినా దళితులపై మాత్రం దాడులు ఆగడం లేదు. దళితులపై దాడులు చేస్తున్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి ఈ ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతాం.

మొద్దు రామంజి, బి.యాలేరు, ఆత్మకూరు మండలం

విత్తన పంపిణీపై.. జగన్ సర్కార్ నిర్లక్ష్యం

గత ఏడాది మే 5కే సబ్సిడీ ధరల ఖరారు

ఈసారి మార్చిలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఇప్పటి దాకా అతీగతీలేని వైనం

ఎన్నికల కమిషన్ అనుమతిలోనూ అశ్రద్ధేనా..?

పోలింగ్ తర్వాతనైనా మొదలు పెడతారా...?

ప్రభుత్వం తీరుపై రైతుల ఆగ్రహం



అనంతపురం అర్బన్, మే 10 : కరువు రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల పంపిణీపై జగన్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే జిల్లాకు అవసరమయ్యే విత్తన వేరుశనగ, ఇతర రకాల అంతర పంటల విత్తనాల మోతాదుపై జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రెండు మాసాలు గడుస్తున్నా ఇప్పటి దాకా అతీగతీ లేకుండా పోయింది. సార్వత్రిక ఎన్నికల సమయం కావడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ప్రతి ఏడాది రెగ్యులర్‌గా జరిగే విత్తన పంపిణీపై ఎన్నికల కమిషన్ నుంచి అనుమతులు తీసుకొని ప్రక్రియను మొదలు పెట్టడంపై ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. ఇందుకు మరో మూడు వారాలే సమయం ఉంది. ఇప్పటి దాకా జిల్లాకు విత్తన కేటాయింపులు చేయకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం తరపున వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మినహాయింపు కోసం లేఖ రాశారో..? లేదో తెలియని దుస్థితి నెలకొంది. పోలింగ్ తర్వాతయినా రాష్ట్ర ఉన్నతాధికారులు దీనిపై కదులుతారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సబ్సిడీ విత్తన కాయల పంపిణీ ఆలస్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్చిలోనే ప్రతిపాదనలు

ఈ ఏడాది మార్చిలోనే ఖరీఫ్ సీజన్‌లో విత్తన వేశనగతోపాటు ఇతర రకాల విత్తనాల కేటాయింపులకు సంబంధించి ప్రతిపాదనలు పంపారు. ఈసారి జిల్లాకు వేరుశనగ 1.25 లక్షల క్వింటాళ్లు, కంది 2,500 క్వింటాళ్లు, గ్రీన్ పచ్చిరొట్టి ఎరువులు 600, కొర్ర 100, పెసలు 100, అలసందలు 150, రాగి 50 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి దాకా జిల్లాకు విత్తనాలు కేటాయించి, సంబంధించిన గైడ్‌లైన్స్‌ను జారీ చేయడంలో జగన్ సర్కార్ తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. రెండు మాసాల క్రితమే ప్రతిపాదనలు పంపినా ఇప్పటి దాకా అతీగతీ లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది మేలోనే ప్రారంభం

గత ఏడాది మే మొదటి వారంలోగానే విత్తన వేరుశనగతోపాటు ఇతర రకాల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. గత ఏడాది మే 16 నుంచి ఆర్బీకేల్లో రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ మొదలు పెట్టారు. మే 29 నుంచి విత్తన పంపిణీ ప్రారంభించారు. ఈసారి ఇప్పటి దాకా విత్తన పంపిణీకి సంబంధించిన ఎలాంటి విధివిధానాలు జారీ కాలేదు. మరోవైపు విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ జరగలేదు.

విత్తన పంపిణీలో జాప్యం దారుణం



కరువు రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల పంపిణీపై ప్రభుత్వం జాప్యం చేయడం దారుణం. ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా మిన్నకుండిపోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదు. రైతులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చి, ఓట్లు వేయించుకొని, అధికారంలోకి రాగానే పూర్తిగా విస్మరించారు. ఈ ఏడాది సబ్సిడీ విత్తన కాయల పంపిణీపై తీవ్ర అశ్రద్ధ వహించడం అన్యాయం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని సకాలంలో విత్తన కాయలు పంపిణీ చేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

రైతుల జీవితాలతో చెలగాటం



కరువు రైతుల జీవితాలతో జగన్ సర్కార్ చెలగాటమాడుతోంది. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగతోపాటు కంది, ఇతర రకాల పంటలు సాగవుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి సీజన్‌లో సబ్సిడీ విత్తన కాయలు అందజేయడంలో జాప్యం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని రైతులకు సకాలంలో విత్తన పంపిణీ జరిగేలా చొరవ చూపడంలో జగన్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. ఐదేళ్లుగా సబ్సిడీ పథకాలు అమలు చేయకుండా రైతులకు అన్యాయం చేసిన జగన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు రైతులంతా సిద్ధంగా ఉన్నారు.

- బొల్లు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, తెలుగు రైతు విభాగం

పంపిణీకి పనికిరామా..?

స్థానిక నాయకులను నమ్మని వైసీపీ
పక్కవాళ్ల చేతులమీదుగా నోట్ల పంపిణీ
వలంటీర్లు చెప్పిన ఇళ్లకే నగదు
అభ్యర్థుల తీరుపై నాయకుల మండిపాటు

అనంతపురం క్రైం, మే 10 : సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఈసారి స్థానిక నాయకులను పట్టించుకోలేదు. ఎమ్మెల్యే అభ్యర్థులు పంపిన మనుషుల చేతుల మీదుగానే నోట్లు అందజేస్తున్నారు. అది కూడా అప్పటికే సిద్ధం చేసిన జాబితా మేరకు వలంటీర్లు సూచించిన ఇళ్లల్లో ఎంత మంది ఉన్నారో వారికి ఆ నోట్లు అందజేస్తున్నారు. దీంతో స్థానిక నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మా పైనే నమ్మకం లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం వలంటీర్లను నమ్మినంత కూడా నమ్మకపోతే ఇక మేమెందుకు అంటూ గుర్రుగా ఉన్నారు. తాము కేవలం పనిచేయడానికేనా అని ప్రశ్నిస్తున్నారు. సచివాలయం, వలంటీర్లను తీసుకొచ్చి ముఖ్యమంత్రి జగన్ మమ్మల్ని కనీస విలువ లేకుండా చేశాడని మండిపడుతున్నారు. ఇప్పుడు లెక్కలు పంచే విషయంలోనూ నమ్మడం లేదని, ఇదేం రాజకీయ బతుకు అంటూ నిట్టూరుస్తున్నారు. పంచాయతీల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థాయి, పట్టణాల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లను సైతం పట్టించుకోలేదట.

స్థానిక నాయకులను కాదని..

ఈసారి ఓట్ల కోసం డబ్బుల పంపిణీలో స్థానిక నాయకులను పక్కన పెట్టడం ఆ వర్గాలను కలచివేస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. శింగనమల నియోజకవర్గంలో ఓటుకు రూ.వెయ్యి పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇందుకు ఎస్ఆర్ఐటీ విద్యార్థులు, సిబ్బందినే ఉపయోగిస్తున్నారట. అనంతపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అంతరంగికులే ముందుండి పంపిణీ చేయించేశారు. ఇక్కడా ఓటుకు రూ.వెయ్యి చొప్పున వలంటీర్లు ఇచ్చిన జాబితా మేరకు డబ్బు అందజేస్తున్నారట. చాలా తక్కువలో తక్కువ మంది కార్పొరేటర్లకు పంపకాలకు సంబంధించి అందజేసినట్లు సమాచారం. తాడిపత్రి నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేలు ప్రకారం ఇప్పటికే పంపిణీ చేశారు. అక్కడంతా తమ నాయకులకే అందజేసినట్లు తెలుస్తోంది. నమ్మకం లేని చోట మాత్రమే ఎమ్మెల్యే అభ్యర్థి మనుషుల సమక్షంలో పంపకాలు చేశారు. ఉరవకొండ పట్టణంలో రూ.2వేలు చొప్పున పంచేశారు. రూరల్ పరిధిలో రూ.1000 పంపిణీ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. ఈ నియోజకవర్గంలోనూ కొత్త బృందాలే డబ్బును పంపిణీ చేశాయి. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డే బాధ్యత తీసుకున్నారు. పుంగనూరు నుంచి ప్రత్యేకంగా వచ్చిన తన అనుచరులు, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థుల అనుయాయులతో కలిసి డబ్బు పంపిణీ చేశారు. కళ్యాణదుర్గంలో ఓటుకు రూ.2వేలు, రాయదుర్గంలో రూ.1500 చొప్పున పంపిణీ చేయించారు. గుంతకల్లు నియోజకవర్గంలోనూ వలంటీర్లు, కొత్త వ్యక్తులతో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిసింది.



పోలీసులు గప్ చుప్

వైసీపీ నాయకులు మరోసారి అధికారమే లక్ష్యంగా తెగబడుతున్నారు. ఓటర్లను లక్ష్యంగా చేసుకొని వివిధ రకాలుగా ప్రలోభాలకు గురి చేస్తున్నారు. డబ్బు పంపిణీ పూర్తవగానే మద్యం, మాంసంతో విందులు ఏర్పాటు చేయించడానికి సిద్ధమయ్యారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం గప్‌చుప్‌గా ఉన్నారు. దాదాపు ఇప్పటికే 50శాతంపైగా పంపిణీ చేసినప్పటికీ ఏ నియోజకవర్గంలోనూ పోలీసులు పట్టుకున్నది లేదు. పోలీసులకు తెలిసే ఇదంతా జరుగుతోందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జన కేతనం 5
ఆంధ్రజ్యోతి
అనంతపురం
శ్రీ సత్యసాయి
శనివారం 11 మే 2024

మారుతున్న గాలి !



కదిరి పోరు ఏకపక్షమేనా ?
వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం
అంతటా ఆక్రమణలు, దౌర్జన్యాలే
రాజకీయం వర్సెస్ వ్యాపారం
వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు
కందికుంటకు సానుకూలంగా పరిణామాలు

కదిరి: కదిరి అసెంబ్లీ పోరు ఉమ్మడి జిల్లాలో ఆసక్తిని రేపుతోంది. గత రెండు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ టీడీపీ తరఫున బరిలో నిలిచారు. మూడునెలల ముందు పార్టీలో చేరిన వ్యాపారవేత్త మగ్బూల్ అహ్మద్ వైసీపీ తరఫున పోటీకి దిగారు. కదిరి నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఏడు సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, వైసీపీ రెండు సార్లు, బీజేపీ, ఇండిపెండెంట్‌లు ఒక్కోసారి గెలిచారు. ఇందులో ఇద్దరు మంత్రులుగా పని చేశారు. తొలి ఎమ్మెల్యే కేవీ. వేమారెడ్డి స్పీకరుగా పని చేశారు. నియోజకవర్గంలో కదిరి, తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంట, నల్లచెరువు, తనకల్లు మండలాలు ఉన్నాయి. నియోజవర్గంలో మొత్తం 2,53,420 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 124650 మంది ఉండగా స్త్రీలు 128762 మంది, ట్రాన్స్‌జెండర్‌లు 8మంది ఉన్నారు. నియోజవర్గంలో మొత్తం 281 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

పోరు ఏకపక్షమేనా ?

కదిరి అసెంబ్లీ ఎన్నికల పోరు ఏకపక్షమేనని పలువురు చెబుతున్నారు. కూటమి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ గడచిన 20 ఏళ్ల నుంచి స్థానికంగానే ఉంటూ రాజకీయాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంలో ఆయనకు విస్తృత పరిచయాలు ఉన్నాయి. ఆపద వచ్చినప్పుడు అర్ధరాత్రి పిలిచినా పలికే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. బెంగళూరులో వ్యాపారం చేసుకుంటూ కేవలం ఎన్నికల కోసమే వచ్చిన మగ్బూల్‌కు నియోజకవర్గంతో అంతగా పరిచయం లేదు. పైగా ఆయన నాయకత్వానికి అందరి ఆమోదం లేదు. ఆయన ఉండగానే ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పూల శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం వైసీపీలోని డొల్లను బహిర్గతం చేస్తున్నాయి. దీంతో వైసీపీ అభ్యర్థి గెలుపుపై సొంతపార్టీ నాయకులకే నమ్మకం లేక అనేక మంది ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి క్యూ కట్టారు. దీనికి తోడు ఎమ్మెల్యే సిద్దారెడ్డి వర్గం వైసీపీ అభ్యర్థికి పూర్తిగా దూరంగా ఉంది. ప్రచార సరళిలో కూడా వైసీపీ బాగా వెనుకబడి ఉంది. నామినేషన్‌ల రోజే వైసీపీ అధినాయకత్వం అంచానాలకు తగ్గట్టుగా ప్రజలు రాలేదని నిరుత్సాహంగా ఉన్నట్లు తెలిసింది.

ఐదేళ్లు కబ్జాలు, దౌర్జన్యాలే

వైసీపీ అధికారంలో ఉన్న గత ఐదేళ్లలో కబ్జాలు, దౌర్జన్యాలు పెరిగిపోయా యి. నిజాంవలి కాలనీలో ఉన్న బీడీ కార్మికుల కమ్యూనిటీ హాల్ కూల్చివేతతో దౌర్జన్యాలు కదిరిలో మొదలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే జొన్నా రామయ్యకు చెందిన జొన్నా లాడ్జ్ ముందు పులివెందులకు చెందిన కొంత మంది, వైసీపీ నాయకులతో కలిసి బండరాళ్లు వేసి పట్టపగలే దౌర్జన్యం చేశారు. దాన్ని టీడీపీ నాయకుడు కందికుంట అడ్డుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో వైసీపీ నాయకులు దాదాపు రెండు కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. అడపాలవీధిలో వైసీపీ నాయకుడు అత్యంత విలువైన భూమిని అక్రమించుకొని ఇల్లు నిర్మించుకునే ప్రయత్నాన్ని కందికుంట అడ్డుకున్నారు. ఇవన్నీ వైసీపీ గెలుపుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

మట్టి మాఫియా, ఇసుక కింగ్‌లు వైసీపీ నాయకులే

నియోజకవర్గంలో మట్టి, ఇసుక ఎక్కడికి తోలాలన్నా కొంతమంది వైసీపీ నాయకులే తోలాలి. ఇతరులు తరలిస్తే కేసుల నమోదైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. మట్టిమాఫియా నాయకుడు ఇన్ని రోజులు ఎమ్మెల్యే సిద్దారెడ్డి వర్గంలో కొనసాగి ఆయనకు టిక్కెట్టు రాకపోవడంతో ప్లేటు ఫిరాయించి వైసీపీ అభ్యర్థి పంచనచేరారు. ఇక ఇసుక కింగ్‌లు అనేకమందే ఉన్నారు. ఇసుక ఎక్కడికి పంపాలన్నా వారికి చెబితే చాలు. వారికి ఎటువంటి సీనరేజి చార్జీలు ఉండవట. అందుకే తక్కువ ధరకే తోలుతామని చెబుతున్నారు. వీరందరూ వైసీపీలోనే కొనసాగుతుండటంతో ప్రజలు వారిని చూస్తే ఏవగించుకుంటున్నట్లు తెలిసింది.

ఎమ్మెల్యే వర్గం దూరం

సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డికి వైసీపీ అధిష్టానం ఈసారి ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వలేదు. దీంతో ఆయన వర్గం వైసీపీ అభ్యర్థి మగ్బూల్‌కు పూర్తి దూరంగా ఉంది. ఎమ్మెల్యే సామాజిక వర్గంలో కూడా ఎక్కువ మంది వైసీపీకి దూరంగా ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా గ్రామాల్లో వైసీపీకి ఆదరణ కొరవడినట్లు సమాచారం. ఎమ్మెల్యే వర్గం దూరం కావడంతో ఏమి చేయాల్లో దిక్కుతోచని స్థితిలో వైసీపీ ఉన్నట్లు తెలిసింది.

వలసలతో వైసీపీ ఉక్కిరి బిక్కిరి

టీడీపీలోకి వలసలు పెరగడంతో వైసీపీ నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు తెలుస్తోంది. కౌన్సిలర్లు మొదలు కొని గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధుల వలసలు నిత్యం కొనసాగుతున్నాయి. వీటి నివారణకు వైసీపీ చేసిన యత్నాలు ఏవీ ఫలించలేదు. కొంతమందికి కానులతో ఎరవేసిన ఆగలేదని టీడీపీలో చేరిన వారు చెబుతున్నారు.

నమ్మకం కోల్పోయిన వైసీపీ

కదిరి ప్రజలు వరుసగా రెండుసార్లు వైసీపీకి అవకాశం ఇస్తే గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని ప్రజలు చెబుతున్నా రు. 2014లో మైనారిటీ అభ్యర్థిగా ఉన్న అత్తార్ చాంద్‌బాషాను గెలిపిస్తే ఆయన రెండేళ్లకే పార్టీ మారి ప్రజల నమ్మకాన్ని కోల్పోయారు. అదే విధంగా 2019లో సిద్దారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన కూడా అభివృద్ధి పనులు చేయలేదని చెబుతున్నారు. అందుకే ఆయన ప్రజల మద్దతు కోల్పోయారని భావించిన అధిష్టానం 2024 ఎన్నికలకు కొత్త అభ్యర్థిని బరిలో నిలిపింది.

మద్యం మొత్తం వైసీపీ వారికే !

ఎన్నికలకు ముందు జగన్నాటకం
మద్యం షాపుల్లో కేవలం డిజిటల్ లావాదేవీలేనట
మధ్యాహ్నం నుంచి సర్వర్ బంద్.. విక్రయాలు బంద్
మద్యం అంతా అధికార పార్టీ నేతలకు తరలిస్తున్న వైనం



కమలానగర్‌లో క్యూకట్టిన మందుబాబులు

అనంతపురం అర్బన్, మే 10: పోలింగ్‌కు ఐదు రోజుల ముందే మద్యం విక్రయాల్లో జగన్నాటకం మొదలైంది. వైసీపీ ఐదేళ్లలో ప్రభుత్వ మద్యం దుకాణాలు, మాల్స్‌లో కేవలం నగదుతోనే మద్యం విక్రయాలు జరిపారు. మారుమూల ప్రాంతాల్లో టీకొట్లు, తోపుడు బండ్ల వద్ద డిజిటల్ లావాదేవీల సదుపాయం ఉన్న కాలంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎందుకు డిజిటల్ లావాదేవీలు పెట్టలేదని ప్రతిపక్షాలు అనేక సార్లు గొంతెత్తినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పోలింగ్‌కు ఐదు రోజుల ముందుగా గురువారం నుంచి మద్యం దుకాణాల్లో కేవలం డిజిటల్ లావాదేవీలే జరపాలని, క్యాష్ ఎట్టిపరిస్థితుల్లోనూ తీసుకోకూడదని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మద్యం షాపుల్లో కేవలం ఫోన్ పే, గుగూల్ పే ద్వారా మాత్రమే అనుమతించారు. ఈ విషయం తెలియక మందు బాబులు క్యాష్‌ను తీసుకువెళ్లారు. ఐదేళ్ల పాటు డిజిటల్ లావాదేవీల ఆప్షన్ పెట్టాలని కోరినా పట్టించుకోకుండా ఇప్పుడేమో కేవలం ఫోన్ పే అంటారా అంటూ మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ లావాదేవీలపై జిల్లా ఎక్సైజ్ అధికారులు ముందస్తుగా ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల సమయం కావడంతో అధికార పార్టీ నేతలకు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి అడిగినన్నీ లిక్కర్ బాటిళ్లు గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే పంపిస్తున్నట్లు తెలిసింది. కొందరు మద్యం షాపులో పనిచేసే సిబ్బంది సందట్లో సడేమియా అన్న చందంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఏ దుకాణానికి వెళ్లినా తమకు నచ్చిన బ్రాండ్లు లేకపోవడంతో నిరాశతో మందుబాబులు వెనుతిరగాల్సి వస్తోంది. పలు మద్యం దుకాణాల్లో కనీసం చీప్ లిక్కర్ అడిగినా స్టాక్ లేదంటూ సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఇదెక్కడి అన్యాయమంటూ మందుబాబులు నిట్టూరుస్తున్నారు. అనంతపురం నగరంతోపాటు పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో మద్యం విక్రయాలు ఆగిపోయాయి. ఎన్నికల నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 13వతేదీ సాయంత్రం 7 గంటల దాకా ప్రభుత్వ మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు బంద్ కానున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా మద్యం స్టాక్ పెట్టుకుందామన్న ఆలోచనతో శుక్రవారం మద్యం షాపులు, మాల్స్ వద్ద మందు బాబులు క్యూకట్టారు. తీరా అక్కడికి వెళితే తమకు కావాల్సిన బ్రాండ్లు లేకపోవడంతో ఎలగబ్బా అంటూ నిట్టూర్చారు. దీంతో షాపులో ఏ మద్యం ఉంటే అదే కొనుగోలు చేసి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మరికొన్ని షాపుల్లో ఆ అవకాశం కూడా లేకపోవడంతో బార్ అండ్ రెస్టారెంట్లకు వెళ్లి అధిక ధరకు మద్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితిని మద్యంప్రియులు ఎదుర్కొన్నారు. ఇదే క్రమంలో బార్ అండ్ రెస్టారెంట్లు కిటకిటలాడాయి.



త్రివేణి థియేటర్ సమీపంలో మూతబడిన మద్యం షాపు

ఆస్తులు గోవిందా

జగన్ మళ్లీ వస్తే భూములకు రక్షణ కరువు
హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే
అడుగడుగునా నీరాజనం



పరిటాల సునీత, పార్థసారథి, శ్రీరామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

పుట్టపర్తి, మే 10 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ మరోసారి అధికారంలోకి వచ్చి జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మీ ఆస్తులు గోవిందా అంటూ హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాప్తాడు నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించారు. రాప్తాడు, చెన్నేకొత్తపల్లి మండలాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన ఆస్తులను లాక్కునేందుకే ఈ యాక్ట్ తీసుకొచ్చారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ యాక్ట్ లేదన్నారు. జగన్‌రెడ్డి ఇది తీసుకురావడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల భూములు కబ్జాచేసేందుకే ల్యాండ్ టైట్లింగ్ చట్టం తెచ్చారని విమర్శించారు. ఈ నల్లచట్టాన్ని రద్దు చేయాల్సిందే అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ చట్టం రద్దవుతుందని హామీ ఇచ్చారు. ఈ భూభక్ష చట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కానీ ప్రజలను మోసం చేయడానికి ఈ చట్టం ఇంకా మార్గదర్శకాలు ఇవ్వలేదని నాటకాలు ఆడుతున్నారని అన్నారు. దేశంలో ఎక్కడాలేని ఈ చ ట్టాన్ని ఎందుకు ఇక్కడ అమలు చేస్తున్నారో ప్రజలు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో ల్యాండ్, శాండ్, మైన్స్, గంజాయి, యర్రచందనం, డ్రగ్స్, రేషన్ బియ్యం, కొల్లగొడుతూ వేల కోట్లు దోచేశారని విమర్శించారు. వైసీపీ నాయకులు ఏ భూమి కావాలంటే ఆ భూమిని దర్జాగా కబ్జాచేసి ఆక్రమించుకునేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్నారు. రాప్తాడు ఎన్నికల ప్రచారంలో బీకే పార్థసారథితోపాటు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత, యువనేత పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. వీరికి అడుగడుగునా జనం హారతులుపట్టి భారీ గజమాలతో స్వాగతం పలికారు. ప్రజలు ఆలోచించి భవిష్యత్తు బాగు చేసే నాయకుడు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టించే చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలన్నారు. విలువైన ఓట్లను సైకిల్ గుర్తుకు వేయాలని కోరారు.

రేయ్ సాంబా.. కారు దిగు రా..!

నార్పల, మే 10: నార్పలలో వైసీపీ అసమ్మతి నాయకుడు సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లిన సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ఘోర అవమానం జరిగింది. సత్యనారాయణ రెడ్డి అనుచరులు సాంబను అసభ్య పదజాలంతో దూషిస్తూ.. దాడికి యత్నించారు. ఇంట్లోకి తీసుకెళ్లి నిర్బంధించారు. శింగనమల నియోజకవర్గ అభ్యర్థిగా తన వద్ద టిప్పర్ డ్రైవర్‌గా ఉన్న వీరాంజనేయులుకు సాంబ టిక్కెట్ ఇప్పించుకున్నారు. దీన్ని వైసీపీ అసమ్మతి వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శమంతకమణి, యామినీబాల తదితరులు పార్టీని వీడి టీడీపీలో చేరారు. మరికొందరు వైసీపీలోనే కొనసాగుతున్నారు. వీరిలో నార్పల సత్యనారాయణరెడ్డి ఒకరు. ఈ నేపథ్యంలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుతో కలిసి నార్పలలో శుక్రవారం రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించేందుకు సాంబ వెళ్లారు. రోడ్ షోకు సత్యనారాయణరెడ్డి రాకపోవడంతో.. ఆహ్వానించేందుకు సాంబ నేరుగా ఆయన ఇంటి వద్దకు వెళ్లారు. సాంబను చూడగానే సత్యనారాయణరెడ్డి వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోయారు. 'రేయ్ సాంబా.. కారు దిగురా..! ఏ ముఖం పెట్టుకుని మా అన్న ఇంటికి వస్తున్నావ్..? నీ అంతు చూస్తాం..' అని అసభ్య పదజాలంతో దూషిస్తూ.. దాడికి యత్నించారు. సాంబ కారు అద్దాలను ధ్వంసం చేశారు. 'నీకు మా నాయకుడికంటే మించిన లీడర్లు ఎవరున్నారు..? మా నాయకుడిని ర్యాలీగా బహిరంగ సభకు ఎందుకు తీసుకెళ్లలేదు..?' అని నిలదీశారు. కారులో ఉన్న సాంబశివారెడ్డిని కిందకు దించి.. సత్యనారాయణరెడ్డి ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు మూసేశారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. అక్కడే ఉన్న పోలీసులు సత్యనారాయణరెడ్డి అనుచరులను శాంతింపజేశారు. అద్దాలు పగిలిన కారును మీడియా కంటపడనివ్వకుండా అక్కడి నుంచి పంపించేశారు. చివరకు సత్యనారాయణరెడ్డిని బుజ్జగించి, బహిరంగ సభకు తీసుకెళ్లారు. కానీ జనాలు లేక సభ వెలవెలబోయింది. వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులును ఓడిస్తామని సభ వద్దే సత్యనారాయణరెడ్డి అనుచరులు హెచ్చరించడం గమనార్హం.

ఏ ముఖం పెట్టుకుని మా వద్దకు వచ్చావ్..?
ఆలూరు సాంబకు అవమానం
ఇంట్లోకి లాక్కెళ్లి నిర్బంధించిన అసమ్మతి వర్గం నాయకులు



సాంబ వాహనాన్ని అడ్డుకున్న అసమ్మతి వర్గం

ఇష్టారాజ్యంగా ఎన్నికల డ్యూటీ

ఉన్నఫలంగా ఉత్తర్వులు... మండిపడుతున్న టీచర్లు, ఉద్యోగులు



అనంతపురం విద్య, మే 10: మినహాయింపు ఇచ్చిన వారికి ఉన్నఫలంగా ఎన్నికల డ్యూటీ వేయడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. తొలుత ఆపరేషన్, దివ్యాంగత్వం, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇప్పుడు ఉన్న ఫలంగా డ్యూటీ వేసి, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సదుపాయంపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు మండిపడుతున్నారు. ఈ నెల 9న ఉన్నఫలంగా పలువురు ఉపాధ్యాయు లు, ఉద్యోగులకు పీఓ, ఏపీఓ, ఓపీఓ డ్యూటీలు వేశారు. అనంతపురం, శింగనమల నియోజకవర్గాలకు డ్యూటీలు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఫోన్లు చేసి ఆర్ట్స్ కాలేజ్, జూనియర్‌కాలేజ్ వద్దకు రావాలని సూచించారు. మినహాయింపు పొందినా ఉన్నఫలంగా డ్యూటీ వేయడంతో ఇదెక్కడి గొడవ బాబోయ్ అంటూ....వాళ్లు చెప్పిన సమయానికి, చెప్పిన స్థలానికి బిక్కుబిక్కు మంటూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పరుగులు తీశారు. ఉదయం 10 గంటలకు వెళ్లినా...మధ్యాహ్నం 1 గంట వరకూ ఏ అధికారీ రాలేదు. సాయంత్రం వెళ్లినా ఎవరూ వచ్చి ఎలాంటి ఆదేశాలు ఇవ్వడకపోవడంతో డ్యూటీలు పడిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీవో, ఏపీవోలకు మూడు సార్లు శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు కొత్తగా ఉత్తర్వులు ఇచ్చిన వాళ్లకు ట్రైనింగ్ అవసరం లేదా..? ట్రైనింగ్ ఇవ్వకుండా వాళ్లు ఎలా డ్యూటీ చేస్తారన్నది అధికారులకే తెలియాలి.

మేనిఫెస్టోలో బీసీలకు పెద్ద పీట

అనంతపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మే 10 : కూటమి మేనిఫెస్టోలో బీసీలకు పెద్ద పీట వేశామని అనంతపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక యాదవ భవన్‌లో బీసీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అంబికా మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే బీసీలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల కోసం రక్షణ చట్టం తెస్తామని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతోనే జగన్ సరిపెట్టారని అన్నారు. నిధులు కేటాయించకుండా కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశాన్నారు. కార్పొరేషన్లల్లో ఛైర్మన్లు, కమిటీ సభ్యులు కుర్చునేందుకు కుర్చీలు కూడా లేవన్నారు. అలాంటప్పుడు కార్పొరేషన్లు పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. వైసీపీలోని బీసీలు కూడా ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని చంద్రబాబు నాయకత్వాన్ని సమర్థించి, బీసీ కులాల బాగు కోసం కలిసికట్టుగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లల్లో లక్షన్నర కోట్లు కేటాయిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీసీలకు స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతోపాటు అన్నింటా బీసీలకు ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీసీలంతా ఏకమై టీడీపీకి సంపూర్ణ మద్దతు నివ్వాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీసీలతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఈనెల 13న ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలని ఎదురుచూస్తున్నారని అన్నారు. కేంద్రంలో ప్రధాన మంత్రిగా మోదీ.. రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడం ఖాయన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతోపాటు అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తారని తెలిపారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....
దోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.





దగ్గుబాటి, ప్రభాకర్ చౌదరిని సత్కరిస్తున్న అభిమానులు, టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, హామీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దగ్గుబాటి, తెలుగు మహిళలు

అభివృద్ధిలోనూ అనంత అబద్ధాలు

ఎమ్మెల్యే అనంత ప్రచారంపై దగ్గుబాటి ప్రసాద్ ఫైర్


అనంతపురంరూరల్, మే 10: నగరంలో కనిపిస్తున్న అభివృద్ధి అంతా తెలుగుదేశం పార్టీ హయంలో జరిగిందేనని, వైసీపీ మాత్రం తాము చేసినట్లు ప్రచారం చేసుకొంటోందని అర్బన్ నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని రుద్రంపేట పంచాయతీలోని వికలాంగుల కాలనీలో వారు ఎన్నికల ప్రచారం చేపట్టారు. మొదటి సారి ఇలా ఇద్దరు నేతలు కలసి ప్రచారం చేయడం పార్టీ క్యాడర్‌లో మరింత జోష్ కనిపించింది. దగ్గుబాటికి ఓటు వేసి గెలిపించాలని ప్రభాకర్ చౌదరి అభ్యర్థించారు. దగ్గుబాటి మాట్లాడుతూ.. ప్రజలంతా మార్పు కోరుకుంటు న్నారన్నారు. ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ.. నగరంలో ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ, సుభాష్‌రోడ్డు పనులు అన్ని టీడీపీ హయంలో మంజూరు అయినవేనని, నగరానికి తాగునీటి సమస్య వస్తే చిన్న మోటర్‌ను రిపేరు చేయించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు.

వైసీపీని ఓడించేది మహిళలే

అనంతపురం అర్బన్ : స్థానిక నగరంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో మహిళల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ..... ఈ ఎన్నికల్లో జగన్‌ను గద్దెదించేది మహిళలేనని అన్నారు. మహిళల సత్తా ఏంటో ఈ ఎన్నికల్లో జగన్ చూస్తారన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత మాదని, అనంత అర్బన్‌లో దగ్గుబాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. మేనిఫెస్టోలో చంద్రబాబు మహిళలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. దగ్గుబాటి మాట్లాడుతూ... టీడీపీతోనే అసలైన మహిళా సాధికారత సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ మేయర్ స్వరూప, దగ్గుబాటి శ్రీలక్ష్మి, బుల్లితెరనటులు భవాని చౌదరి, నవీన, ఆశికా, విక్రమాదిత్య, జ్యోతి, శాంతి, తెలుగు మహిళలు విశాలాక్షి, బల్లా పల్లవి, విజయశ్రీరెడ్డి, వడ్డే భవానీ, వసుంధర, ఆయేషా, సుజాతమ్మ, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ.. బీసీల పార్టీ

బీసీల కోసమే టీడీపీ పుట్టిందని దగ్గుబాటి అన్నారు. తాము అధికారంలోకి రాగానే అనంతలో బీసీ భవన్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక యాదవ భవన్‌లో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల ద్రోహి జగన్ అని, ఈ ఎన్నికల్లో జగన్ ఇంటికి పంపించేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో తనకు ఒక అవకాశం ఇవ్వాలని, అందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, నాయకులు తలారి ఆదినారాయణ, కుంచెపు వెంకటేష్, దళవాయి వెంకటనారాయణ, నారాయణస్వామి యాదవ్, రాజేంద్ర, పోతుల లక్ష్మీనరసింహులు, బ్యాళ్ల నాగేంద్ర, కురబ నారాయణస్వామి, గోపాల్ గౌడ్, చెరుకూరి శివ, జస్వంత్ వ్యాస్, జనసేన నాయకులు జయరాం రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

భారీ బైక్ ర్యాలీ

స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం నుంచి రాంనగర్ పై ఓవర్ బ్రిడ్జి, అంబేద్కర్ విగ్రహం, సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జి, గాంధీ సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, క్లాక్ టవర్ మీదుగా బళ్లారి బైపాస్ దాకా బైక్ ర్యాలీ కొనసాగింది. దగ్గుబాటి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో దాదాపు 3వేల మంది యువకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు

అనంతపురంరూరల్: ఎన్నికలకు రెండు రోజుల ముందు పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారు. 49వ డివి జన్‌లో ఎస్‌బిఎంఎస్ రామాంజనేయులు ఆధ్వర్యంలో 200 మంది టీడీపీలోకి చేరారు. ఆర్కే నగర్‌లో వీరందరికీ దగ్గుబాటి ప్రసాద్ పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే దగ్గుబాటి సోదరుడు దగ్గుపాటి ప్రతాప్ సమక్షంలో 13వ డివిజన్‌కి చెందిన 60 మంది టీడీపీలోకి చేరారు. అలాగే రాజీవ్ కాలనీ పంచాయతీలోని ముత్యాలమ్మ కాలనీలో 70 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కనంపల్లి శ్రీనివాస్, సంజన్న, బాలరాజు, గిరీష్‌కుమార్, చంద్రన్న, హేమంత్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి వన్నూరు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే తోపు దాడులు

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత




పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

ఆత్మకూరు, మే 10: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులకు ఓటమి భయం పట్టుకుందని, దీంతోనే దాడులకు తెగబడుతున్నారని కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత అన్నారు. వారికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ఓటుతో వారికి బుద్ధి చెప్పాలని సూచించారు. ఆత్మకూరులో శుక్రవారం ఎంపీ అభ్యర్థి పార్థసారథితో కలసి నిర్వహించిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. రాప్తాడులో ఎక్కడ చూసినా తోపు సోదరులు దందాలు, అరాచకాలు, అవినీతే కనిపిస్తున్నాయన్నారు. ఇల్లు నిర్మాణంలో రూ. 200 కోట్లు దండుకొని పేదలకు మొండి గోడలు కట్టి వదిలేశారన్నారు. వైసీపీ కార్యకర్తలు చందాలు వేసుకొని గెలిపిస్తే... వారి జేబులు ఖాళీ చేసి.. తోపులు వారి జేబులు నింపుకున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలు ముందు బనీయన్ చిల్లులు పడ్డాయని చెపిన వ్యక్తి.. రూ. 50 కోట్లుతో ఎలా.. ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. సంస్కారం లేకుండా మీసాలు తిప్పడం.. తొడలు కొట్టడం గొప్ప కాదని, తమ కార్యకర్తలూ అలా చేయగలరని, మాటలు అదుపులో పెట్టుకోవాలని హితవుపలికారు. చేత కాని దద్దమ్మల గురించి ఎప్పుడు పరిటాల కుటుంబం మాట్లాడదని, తన కొడుకు పరిటాల శ్రీరామ్ కాలి గోటికి కూడా పనికి రావని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి బాలాజీ, నారాయణస్వామి, క్రిష్ణమోహన్, అనీల్, రమేష్ నాయుడు, మనోరంజన్, సుబ్బర హరి, ప్రతాప్ వేణుగోపాల్ సుబ్బర హనుమంతు పాల్గొన్నారు.

తోపు అరాచకాలను అడ్డుకోండి

చెన్నేకొత్తపల్లి : ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరుల అరాచకాలను ఓటుతో అడ్డుకోవాలని హిందూపురం పార్లమెంట్ కూటమి అభ్యర్థి బీకే పార్థసారధి, రాప్తాడు కూటమి అసెంబ్లీ అభ్యర్థి పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ప్రజలకు పిలుపునిచ్చారు. చెన్నేకొత్తపల్లిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన భారీ రోడ్‌షోలో వారు మాట్లాడారు. మరో మూడు రోజుల్లో యుద్ధానికి సిద్ధంగా ఉండాలని, అరాచక శక్తులకు ఓటు రూపంలో తగిన బుద్ధి చెప్పా లని అన్నారు. దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో బెదిరించిన తోపుదుర్తి సోదరులకు గుణపాఠం నేర్పాలన్నారు. కబ్జాలు, భూ, ఇసుక, మట్టి దందాలతో రూ. కోట్లను అక్ర మంగా సంపాదించాలన్నారు. రోడ్‌షో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, అంకే అమరేంద్ర, నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి, వడ్డే దుర్గా, చెన్నకేశవులుగౌడ్, శివ, అమరేంద్రరెడ్డి, ఏపీ శ్రీనివాసులు, సూరి పాల్గొన్నారు.



ఆత్మకూరులో పరిటాల సునీతకు గజమాలతో అభిమానుల సన్మానం

వైసీపీ నుంచి టీడీపీలోకి...

అనంతపురంరూరల్: రాప్తాడు నియోజకవర్గం పలు గ్రామాల నుంచి వైసీపీ శ్రేణులు టీడీపీలోకి భారీగా చేరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత సమక్షంలో చెన్నెకొత్తపల్లి మండలం ఆముదాలకుంట, ఆత్మకూరు మండలం ఆత్మకూరు, పాపంపల్లి, సంగంపల్లి, కనగానపల్లి మండలం తగరకుంట, పాతపాళ్యం గుడివాండ్లపల్లి, రామగిరి మండలం నసనకోట, మాదాపురం, అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామం నుంచి 40కుటుంబాలు పార్టీలోకి చేరాయి. పరిటాల శ్రీరామ్ సమక్షంలో రాప్తాడు మండలం మరూరు గ్రామనికి చెందిన 15 కుటుంబాలు, పరిటాల సిద్ధార్థ సమక్షంలో చెన్నెకొత్తపల్లి మండలం ప్యాదిండి, కనగానపల్లి మండలం యలక్కుంట్ల, బాలేపాళ్యం, ఆత్మకూరు మండలం సిద్ధారాంపురం, రాప్తాడు మండలం పాలచర్ల గ్రామాల నుంచి 25 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి.

పలు గ్రామాల్లో ప్రచారం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : పరిటాల కోడళ్లు పరిటాల జ్ఞాన, పరిటాల తేజస్వి అనంతపురంరూరల్ మండలంలోని పాపంపేట పంచాచతీలో ఆంజనేయనగర్, రామన్న చౌదరి కాలనీ, మస్నీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే పరిటాల తేజస్వి పూలకుంటలో ప్రచారం చేపట్టారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లిలో మండల ఇన్‌చార్జ్ దర్మవరపు మురళి, సతీమణి ధనలక్ష్మి, కుమారుడు చేతన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలి

అనంతపురం టౌన్, మే 10: ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఎన్నికల పరిశీలకులు మనీష్‌సింగ్, అజయ్‌నాథ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో శుక్రవారం ఆర్‌ఓలు, నోడల్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. డబ్బు, మద్యం పంపిణీ చేసే వారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ఆర్‌ఓలు, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల పోలీస్ పరిశీలకుడు రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రౌడీషీటర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరిగినా ఎన్నికల కమిషన్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. పోలీసులకు అన్నివిధాలుగా అధికారాలు ఇచ్చామని, ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు రాందాస్ టీ, కాలే మాట్లాడుతూ.. పోలింగ్ దగ్గరపడుతోందని, తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. కలెక్టరు వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రశాంత పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ అమిత్ బర్దర్, జడ్పీసీఈఓ వైఖోమ్ నిదియా, డీఎఫ్ఓ వినీత్‌కుమార్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

తోపుదుర్తి వైసీపీ నాయకులపై కేసు

ఆత్మకూరు, మే 10 : మండలంలోని తోపుదుర్తిలో గురువారం రాత్రి జరిగిన దాడి ఘటనలో తగరకుంట వాసులు ఫిర్యాదు మేరకు పది మంది తోపుదుర్తి వైసీపీ నాయకుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, మహేష్, మరికొందరిపై వైసీపీ మూకలు దాడికి పాల్పడిన విషయం తెల్సిందే. దీనిపై పరిటాల సునీత జిల్లా ఎస్పీకి, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దాడి చేసిన వారిపై 147, 148, 381, 341, 324, 120(బి), 149 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

టీఎన్‌ఎస్‌ఎఫ్, తెలుగుయువత బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న యువకులు

అనంతపురం విద్య, మే 10 : టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు నగరంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని, యువత, విద్యార్థులకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు, జిల్లా కార్యదర్శి శివకుమార్, తెలుగు యువత నాయకులు అబ్దుల్, ఓబుల్‌రెడ్డి, గౌతమ్, కిషోర్, చక్రి నాయుడు, సాయి చరణ్ కుమార్, సోమేశ్ పాల్గొన్నారు.

కూటమితోనే మాదిగలకు న్యాయం

అనంతపురం సెంట్రల్, మే 10 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రతినిధి అక్కులప్ప పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను రద్దు చేయడమే కాకుండా భూ కబ్జాలు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. చనిపోతే కనీసం భౌతిక కాయాన్ని పూడ్చుకునేందుకు శ్మశానాలను సైతం వైసీపీ నేతలు అక్రమించుకున్నారని వాపోయారు. ఐదేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన అరాచకాలకు స్వస్తిపలికేలా ఎన్‌డీఏ కూటమి తరఫున చంద్రబాబునాయుడు మాదిగల అభివృద్ధికి హామీనిచ్చారన్నారు. ప్రతి ఓటరూ సోమవారం పోలింగ్ కేంద్రానికెళ్లి కూటమి అభ్యర్థికే ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లప్ప, మారెన్న, చెన్నప్ప, హనుమంతరాయుడు, కొళ్లాపురప్ప, వేణు, తిప్పేస్వామి, ప్రసాద్, మూర్తి, నాగార్జున పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమితోనే మైనార్టీల అభివృద్ధి


బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఫయాజ్



మాట్లాడుతున్న ఫయాజ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 10: ఎన్‌డీఏ కూటమితో మైనార్టీ వర్గాల అభివృద్ధి సాధ్యమని, ఈ అంశాన్ని ఓర్చుకోలేని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పరోక్షంగా ధర్మవరం ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌పై అక్కసును వెళ్లగక్కుతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సయ్యద్ ఫయాజ్ విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సత్యకుమార్ యాదవ్ ప్రజల మనిషిగా పనిచేస్తూ కేంద్రస్థాయిలో గుర్తింపు పొందారన్నారు. అలాంటి సత్యకుమార్‌పై ఆయన సమీప బంధువులతో అనంత వెంట్రామిరెడ్డి అసత్య ఆరోపణలు చేయించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం నగరంలో రోడ్లువేసి సుందరంగా తీర్చిదిద్దేతే.. ఎమ్మెల్యేగా ఒక్క రూపాయి కూడా అభివృద్ధికి ఖర్చుపెట్టని అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్లలో నగరాభివృద్ధికి ఎంత ఖర్చుచేసారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



పావని మృతదేహం

రామగిరి, మే 10: మండలంలోని కుంటిమద్ది గ్రామానికి చెందిన శకుంతల కుమార్తె పావని (21) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శకుంతల ఎన్ఎస్‌గేటులో చికెన్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. పావని చదువు మధ్యలోనే ఆపేసి ఇంటి వద్ద ఉంటోంది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఆమె ఉరేసుకొని శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. శకుంతల ఫిర్యాదు మేరకు రామగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

వైసీపీ తరపున వలంటీర్ల ప్రచారం

రాప్తాడు, మే 10: మండలంలోని గొందిరెడ్డిపల్లిలో వలంటీర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి.. వైసీపీ తరపున ప్రచారం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా జగన్ బొమ్మ ఉన్న స్టిక్కర్లను ఇంటింటికీ వెళ్లి అతికిస్తున్నారు.

అనంతపురంరూరల్ : మండలంలోని ఇళ్లకు యథేచ్ఛగా జగన్ బొమ్మలతో ఉన్న సిద్ధం స్టిక్కర్లను అతికిస్తున్నారు. అయినా ఎన్నికల అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కందుకూరులో వైఎస్సార్ కాలనీలోని ప్రతి ఇంటికి ఇలా వైసీపీ కార్యకర్తలు స్టిక్కర్లు అతికించారు.




గొందిరెడ్డిపల్లిలో వైసీపీ కరపత్రాలను పంచుతున్న వలంటీర్ అరుణమ్మ, కందుకూరులో ఇళ్లకు అతికించిన సిద్ధం స్టిక్కర్లు

జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 10: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ నాల్గో సంవత్సరం విద్యార్థుల పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ సత్యనారాయణ తన కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల మూడో తేదీ వరకు ద్వితీయ సెమిస్టర్ (ఆర్ 20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించామని, వారంలోపే మూల్యాంకణం చేయించి ఫలితాలను విడుదల చేశామని అన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. కాగా, ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌కు వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు మొత్తం పూర్తిగా చెల్లిస్తేనే ఫలితాలు చూపిస్తామని, సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యం చెబుతుండటంతో వారు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం ఫీజు మొత్తాన్ని విడుదల చేయకుంటే తామెలా కట్టాలని తల్లిదండ్రులు వాపోతున్నా... ఫీజు కట్టాల్సిందేనని కళాశాల యాజమాన్యం పట్టుపడుతోంది.

ఆత్మబంధువులకు పిండప్రదానం

అనంతపురం కల్చరల్, మే 10 : అనాథలు, నిర్భాగ్యులుగా చనిపోయిన 1609 మందికి గతంలో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వీరందరికీ శుక్రవారం ఓంకారేశ్వర్‌లో జరుగుతున్న నర్మదానది పుష్కరాల్లో గోముఖి ఘాట్ వద్ద హిందూ సంప్రదాయ పద్ధతిలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ పిండప్రదానం చేశారు.

బంధువుల మధ్య ఘర్షణ

అనంతపురం క్రైం: నగర శివారులోని జాకీర్ కొట్టాలలో సమీప బంధువులైన యశ్వంత్, వెంకటేష్, వారి బంధువుల మధ్య గురువారం ఘర్షణ జరిగింది. దీనిపై అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

అనంతపురం టౌన్, మే 10: జిల్లాలోని 2,236 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఆర్‌ఓ రామక్రిష్ణా రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్యారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయన వెంట డిప్యూటీ కలెక్టరు ఆనంద్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్షయ తృతీయ



అనంత ఐశ్వర్యేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, మే 10 : అక్షయ తృతీయను పురస్కరిం చుకుని శుక్రవారం నగరం లోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహిం చారు. హెచ్చెల్సీ కాల నీలోని మంజునాథస్వామి దేవాలయ ఆవరణంలో అనంత ఐశ్వర్యే శ్వరస్వామికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. శారదా నగర్‌లోని శివ బాలయోగి ఆశ్రమం, గుల్జార్ పేటలోని కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, పాతూరులోని వ్యాసరాజమఠం, దత్తాత్రేయ మందిరాల్లో విశేష పూజలు నిర్వహించారు.

రిక్షా కార్మికుడికి అమ్మ సంస్థ చేయూత



నగదు, సరుకులు అందజేస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, మే 10 : స్థానిక బుడ్డప్పనగర్‌లో నివాసముంటున్న రిక్షా కార్మికుడు తలారి రంగన్నకు అమ్మ సంస్థ చేయూత నందించింది. ఆయన భార్య లక్ష్మమ్మ కర్పూరం ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. వారి ఇద్దరు పిల్లలు హాస్టల్‌లో ఉంటూ చదువుకొంటున్నారు. ఇటీవల రంగన్న రిక్షాలో లగేజి వేసుకుని వెళ్తుండగా.. బైక్ ఢీకొనడంతో కిందపడ్డాడు. వెన్నెముక, ఎడమకాలు దెబ్బతిన్నాయని, ఆపరేషన్‌కు చేయాలని వైద్యులు తెలిపారు. దీంతో దాతల సహకారం కోసం లక్ష్మమ్మ అమ్మ సంస్థను ఆశ్రయించింది. ఆ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శుక్రవారం వారిని కలిసి... ఆపరేషన్‌కు రూ.3లక్షలు, పిల్లల చదువుల కోసం మరో రూ.లక్ష, నిత్యావసర సరుకులను అందజేశారు.

ఆస్పత్రికి నర్సుల విరాళం

అనంతపురం టౌన్, మే 10: జిల్లా సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది ఆస్పత్రికి రూ. 70 వేల విలువైన సామగ్రిని శుక్రవారం విరాళంగా అందజేశారు. ఆస్పత్రిలో రోగులు పడుతున్న ఇబ్బందులు చూసి చలించిన వారు ... తమవంతుగా ఆస్పత్రికి ఐదు స్ట్రెచ్చర్లు, ఐదు వీల్‌చైర్లు, 10 ప్లాస్టిక్ టేబుల్స్ అందజేశారు. వారిని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ హేమలత అభినందించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రజని, ఆలంబన జనార్దన పాల్గొన్నారు.



స్ట్రెచ్చర్లు, వీల్ చైర్లు, ఇతర సామగ్రి అందజేస్తున్న నర్సులు

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం సుభిక్షం

బుక్కరాయసముద్రం, మే 10: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం సుభీక్షంగా ఉంటుందని ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు అన్నారు. నార్పల మండలంలో బొందలవాడలో ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అందులో టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు ఆలం కృష్ణామనాయుడు, చెన్నప్పనాయుడు, మల్లికార్జున శేషా పాల్గొన్నారు. అలాగే సిద్దలాపురం, కొండాపురం గ్రామాల్లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పలుపుల హనుమంతురెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. శింగనమల మండలంలోని గుమ్మేపల్లిలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి దేగల కష్ణమూర్తి సర్పంచ్ లలితమ్మ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

గార్లదిన్నె: గార్లదిన్నె, కల్లూరు, ఇల్లూరు, కొప్పలకొండ తదితర గ్రామాల్లో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఇందులో గేట్ కృష్ణారెడ్డి, గుర్రం ఆదినారాయణ, గుత్తా బాలకృష్ణ, గుత్తా ఆదినారాయణ, రామకృష్ణ గుర్రంశ్రీను రామాంజి వెంకటేశ్ పాల్గొన్నారు. మండలంలోని కేకే తండకు చెందిన వైసీపీ చెందిన 20 కుటుంబాలు ద్విసభ్యకమిటి సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

శింగనమల : టీడీపీ నాయకుడు మారుతి నాయు డు ఆధ్వర్యంలో సర్పంచ్ రాజు, వెంకటరాముడు సురేష్, వీరాంజి, కాటమయ్య, నరసయ్యనాయుడు ప్రచారం నిర్వహించారు.



బొందలవాడలో ఆలం నరసానాయుడు ప్రచారం

ఏడీసీసీ ఉద్యోగులకు ప్రలోభాలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 10: ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకే ఓటు వేయాలని ఏడీసీసీ బ్యాంకులో ఉద్యోగులను బ్యాంకు కీలక అధికారి ఒకరు ప్రలోభ పెడుతున్నట్లు సమాచారం. ఈ మేరకు ఏడీసీసీ బ్యాంకుల 28 బ్రాంచ్‌లు, 115 సొసైటీలలో పనిచేస్తున్న 1200మంది ఉద్యోగులకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. మెజార్టీ ఉద్యోగులు ఈ హుకుంను తిరస్కరించి నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అధికారికంగా పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయడం, ఖాతాదారులు, రైతులను ప్రలోభ పెట్టేలా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని పలువురు ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల అనంతపురం పార్లమెంట్ పరిధిలోని ఓ నియోజకవర్గానికి చెందిన వైసీపీ కీలక నేతను అధికారికంగా నిర్వహించే సమావేశానికి ఆహ్వానించి అధికారుల మధ్యలో కూర్చోబెట్టిన తీరుపై పలువురు ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆ ఉద్యోగులపై కక్షసాధింపులకు పాల్పడినట్లు విమర్శలు వినవచ్చాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంపై పలువురు ఉద్యోగులు జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలా ఫిర్యాదు చేసిన ఉద్యోగుల వివరాలు సేకరించేందుకు ఆ కీలక అధికారి ప్రధాన కార్యాలయంలో కొంతమంది టీం ద్వారా పనిచేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. కొన్నేళ్లుగా పాతుకుపోయిన ఉద్యోగుల ద్వారా తమ కార్యకలాపాలను ఆ అధికారి చేపడుతూ ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం యత్నిస్తున్నారని చెప్పుకుంటున్నారు.

ఉద్యోగులకు ఎర వేసే కుట్ర

ఏడీసీసీ బ్యాంకు, వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీ)లో మొత్తం 1200 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అధికార వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా పనిచేయాలని వీరిపై ఒత్తిడి చేస్తున్నారు. ఇన్సెంటివ్, బోనస్ ఇస్తామంటూ ఉద్యోగులకు ఎర వేస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. ఇందుకు పలువురు ఉద్యోగులు ససేమిరా అంటున్నారు. కొందరు ఉద్యోగులు చేసేది లేక మిన్నకుండిపోతున్నారు.

జాతీయపోటీలకు అనంత విద్యార్థి



తిలక్

అనంతపురం సెంట్రల్, మే 10: జాతీయస్థాయిలో నిర్వహించే నైపుణ్యాల ప్రదర్శన పోటీలకు నగరానికి చెందిన విద్యార్థి తిలక్ ఎంపికయ్యాడు. విద్యార్థి తల్లి గిరిజా కళ్యాణి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో చిరుద్యోగి. తండ్రి శ్రీనాథ శాస్త్రి పురోహితుడు. వారు మాట్లాడుతూ.. తిలక్ కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరం చదువుతున్నాడని, రాష్ట్ర స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన వివిధ ట్రేడ్ విభాగాల్లో నైపుణ్యాల పోటీల్లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ (సంకలిత తయారీ) విభాగం నుంచి ప్రతిభ కనబర్చాడని తెలిపారు. దీంతో ఈ నెల 14 నుంచి 19 వరకు ఢిల్లో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీపై ఫిర్యాదు

అనంతపురంరూరల్, మే 10: మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ మటన్‌మార్కెట్ పరిధిలోని ఓటర్ స్లిప్పులు వలంటీర్ల ద్వారా పంపిణీ చేయడంపై స్థానిక టీడీపీ నాయకులు మంగళరాము శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో స్థానిక బీఎల్‌ఓతో ఫోన్‌లో ఆయన మాట్లాడిన సంభాషణను సమాచార మాధ్యమాల్లో వైరల్ అయింది. ఓటర్ స్లిప్పులు ఓటర్లకు ఇవ్వకుండా వలంటీరకు ఎలా ఇస్తారని స్థానిక బీఎల్‌ఓ వరలక్ష్మిని ఆయన ప్రశ్నించారు. వలంటీర్ వన్నూర్ ఇటీవల రాజీనామా చేయడంతో అతనితో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయిస్తున్నట్లు బీఎల్‌ఓ చెప్పుకొచ్చింది. ఇస్తే అధికార, ప్రతిపక్షపార్టీల సభ్యులకు ఇవ్వాలని కాని.. వలంటీర్‌గా పనిచేసిన వ్యక్తి ఎలా ఇస్తారని మంగళరాము మండిపడ్డారు. దీంతో శనివారం నుంచి తానే ఓటర్ స్లిప్పులను పంచుతాని బీఎల్‌ఓ చెప్పింది.

వైసీపీ డబ్బు పంపిణీని అడ్డుకోండి

అనంతపురం న్యూటౌన్ : జిల్లాలో వైసీపీ అభ్యర్థులు వలంటీర్ల ద్వారా ఓటర్లకు డబ్బులను పంపిణీచేస్తున్నారని, దాన్ని అడ్డుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లికార్జున కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్‌తో కలిసి శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ అభ్యర్థులు జిల్లాలోని ఏడు నియోజవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు వలంటీర్లు, రాజీనామా చేసిన వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి డబ్బులు పంపిణీ చేస్తున్నారన్నారు. అధికార పార్టీ కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొంటున్నా... అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్య క్షుడు వాసు, నాయకులు ఇమామ్, క్రిష్ణ, శర్మాస్ వలి, సీపీఐ నాయకులు నారాయ ణస్వామి, శ్రీరాములు, రమణ పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.34 వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.34 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.21 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 778 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదల సంక్షేమం

● కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్/గుమ్మఘట్ట, మే 10: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి పేదల సంక్షేమాన్ని అందిస్తుందని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులుస్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయదుర్గం మండలంలోని డీ కొండాపురం, గుమ్మఘట్ట మండలంలోని శిరిగేదొడ్డి, చెరువుదొడ్డి, భూతయ్యదొడ్డి గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలతో ఆయన సత్కరించి స్వాగతించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం సంవత్సరానికి, మూడు సిలిండర్లు, పట్టా పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం, 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఆడపడుచుకు నెలకు రూ.1500 అందిస్తుందన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందిస్తామన్నారు.

ఎంపీటీసీ శ్యామల టీడీపీలో చేరిక: రాయదుర్గం మండలంలోని మెచ్చిరి ఎంపీటీసీ శ్యామలతో పాటు గ్రామానికి చెందిన నలుగురు వార్డు మెంబర్లు అనూరాధ, గంగమ్మ, రాజన్నలతో పాటు మరొకరు శుక్రవారం టీడీపీలో చేరారు. చదం గొల్లదొడ్డి గ్రామంలో మాజీ ఎంపీటీసీ కుమారుడు నాగప్ప, డొక్కు ముత్యప్ప, కిష్టప్ప, తిప్పేస్వామితో పాటు మరో ఆరు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

రైతులకు అండగా నిలిచేది టీడీపీయే

కణేకల్లు: రైతులకు ఎల్లవేళలా అండగా నిలిచేది టీడీపీయేనని కాలవ శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన యర్రగుంట, పుల్లంపల్లి, నల్లంపల్లి గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంత రైతులు నాన్ ఆయకట్టు భూములలో పంటల సాగుకు హెచ్చెల్సీ నీటిని వాడుకున్నా ఏ రోజు కూడా అభ్యంతరం చెప్పలేదన్నారు. ఎన్నికలు మరో రెండురోజులు ఉన్న దృష్ట్యా టీడీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కాలవ

యువతకు 20 లక్షల ఉద్యోగాలు

రాయదుర్గం: నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలిచ్చి ఉపాధి కల్పిస్తామని కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గుమ్మఘట్ట రోడ్డులో వున్న రైస్‌మిల్ వద్ద తెలుగుయువత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చాలా అవసరమని, ఆయన్ను గెలిపించుకోవడానికి యువత నడుం బిగించాలన్నారు. రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించేందుకు సైనికుల్లా శ్రమించాలన్నారు.



టీడీపీలో చేరుతున్న ఎంపీటీసీ శ్యామల



యర్రగుంట్లలో రోడ్‌షో



టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్రబాబు



మైనార్టీలు ఆదరించాలని కోరుతున్న అమిలినేని

కళ్యాణదుర్గం కంచుకోటలో టీడీపీదే విజయం

● కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మే 10: కళ్యాణదుర్గంలో టీడీపీ విజయం ఖాయమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రజావేదిక వద్ద వివిధ గ్రామాల నుంచి భారీఎత్తున టీడీపీలోకి చేరారు. వీరందరికీ అమిలినేని కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామానికి చెందిన 13 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తొమ్మిది వైసీపీ కుటుంబాలు చేరాయి. నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికులంతా కలసి సురేంద్రబాబుకు మద్దతు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మసీదులకు అమిలినేని వెళ్లి మైనార్టీలతో కలసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. టీడీపీకే తమ మద్దతు అని వారు వారు అభయం ఇచ్చారు. ప్రజావేదిక వద్ద బసవేశ్వరస్వామి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విరక్తి మఠం పీఠాధిపతి కళ్యాణస్వామి ఆశీస్సులను అమిలినేని తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రజలందరు టీడీపీకి బ్రహ్మరథం పడుతూ అపూర్వ స్వాగతం పలుకుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో రోజురోజుకు ప్రజాబలం పెరుగుతోందన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చేది టీడీపీయేనని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం నియోజకవర్గమంతా అస్తవ్యస్త పరిపాలనకు తెరలేపారన్నారు. ఎక్కడ చూసినా వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారే కనిపిస్తున్నారన్నారు. నియోజవకర్గంలో టీడీపీకి ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానన్నారు. మున్సిపాలిటీ అంతా దుర్గంధమయంగా మారిపోయి అస్తవ్యస్తంగా తయారైందన్నారు. మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్ది ఆదాయ వనరుగా మార్చడమే తన ప్రధాన ధ్యేయమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. భావితరాల భవిష్యత్తు అభివృద్ధి పథంలో వుండాలంటే విజన్ వున్న నాయకుడు చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. అందరూ కలిసికట్టుగా చంద్రబాబును సీఎంగా గెలిపించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పల్లెప్రాంతాలన్నీ అభివృద్ధి లేక అధ్వానస్థితికి చేరుకున్నాయన్నారు. ఇలా వుండటానికి కారణం ఒక్క వైసీపీ పరిపాలనే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అభివృద్ధిని ఆలోచించి సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునే దిశగా వుండాలన్నారు. అప్పుడే మన ఊరు మన ప్రాంతం అభివృద్ధి చెందేందుకు అవకాశం వుంటుందన్నారు. వైసీపీ మేనిఫెస్టోలో బొమ్మలు తప్ప అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా లేవన్నారు. 13వ తేదీన ఓటు అనే ఆయుధంతో ప్రతి ఒక్కరు టీడీపీని ఆదరించి గెలిపించాలని కోరారు.



విరక్తి మఠం పీఠాధిపతి కళ్యాణస్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న అమిలినేని సురేంద్రబాబు

వంద రోజుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తాం: కేశవ్



రోడ్‌షోలో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 10: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఉరవకొండలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ, పార్క్, అంజనేయస్వామి గుడి, కామన్నకట్ట, జైనబీ దర్గా కూడలిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్‌షోకు మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఉరవకొండలో నీటి సమస్యకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కారణమన్నారు. కనీసం తాగునీటి ప్రాజెక్టులపై అవగాహన కూడా లేదన్నారు. ఇలాంటి అసమర్థులకు ఓటు వేయవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. పని చేసే వారికి పట్టం కట్టాలని సూచించారు. అర్హులై ఉండి పట్టాలు రాని వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, వైసీపీ పాలనలో ప్రజలు విసుగు చెందారని, మార్పు కోరుకుంటున్నారన్నారు. కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పోటీ చేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణంలోని జామియా మసీదు, మదీన మసీదు, పాత సంత మార్కెట్‌లోని మసీదుల్లో శుక్రవారం కేశవ్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు వేల్పుల శ్రీనివాసులు, బీరే శేఖర్, సుదర్శన్, బాలచంద్ర, వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, వాసు, రహంతుల్లా, ఈడిగ, వేణు, నూర్, యూనిస్ పాల్గొన్నారు.

టీడీపీలోకి 10 కుటుంబాల చేరిక

విడపనకల్లు: మండల కేంద్రానికి చెందిన 10 కుటుంబాలు శుక్రవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ సమక్షంలో వైసీపీ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీకి సీనియర్ నాయకుడు రియాజ్ పార్టీ విధానాలు నచ్చక కుటుంబ సభ్యులతో పాటు టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. మహమ్మద్, ఖాదర్‌బాషా, వడ్డే వెంకటేశులు, ఆచారి, సుమో అంజి, బసన్న, వారి కుటుంబ సభ్యులు టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో పాపారాయుడు, మోహన్, ప్రకాష్, పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడిలో టీడీపీ మహిళలు శుక్రవారం ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీ నారాయణను గెలిపించాలని కోరారు. దబ్బర సుశీలమ్మ, స్రవంతి, పుష్పవతి, సింధు, యశోదమ్మ పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక: మండలంలోని బూదివర్తి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు తిమ్మన్న, తిమ్మరాజులు శుక్రవారం టీడీపీలోకి చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున స్థానిక పార్టీ కార్యాలయంలో కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే వెంకటాద్రిపల్లికి చెందిన వైసీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తలారి పెద్ద రాజు, హనుమంతరాయుడు, సోమశేఖర తదితరులు ఉన్నారు.



ఆలింగనం చేసుకున్న కేశవ్



పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



పామిడిలో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం



మహిళలకు విక్టరీ గుర్తు చూపుతున్న జయరాం

వైసీపీకి భయపడొద్దు.. అండగా ఉంటా..

● కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం

పామిడి, మే 10: ఐదేళ్లుగా నరకయాతన పెడుతున్న వైసీపీ ప్రభుత్వం, పార్టీ నాయకులకు భయపడవద్దని, అతి త్వరలో టీడీపీ ప్రభుత్వం వస్తుందని, తాను అండగా ఉంటానని కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం భరోసా ఇచ్చారు. పామిడిలో శుక్రవారం చేపట్టిన ర్యాలీ విజయవంతమైంది. సరస్వతీ విద్యా మందిరం నుంచి వాల్మీకి సర్కిల్ వరకూ చేపట్టిన ఈ ర్యాలీ బాణాసంచా పేలుస్తూ, డప్పులు, యువత ఈలలు, కేరింతల మధ్య ఎంతో కోలాహలంగా సాగింది. ర్యాలీతో టీడీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నిండింది. వాల్మీకి సర్కిల్ వద్ద గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ పోలింగ్ రోజు ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కూటమితోనే సర్వతోముఖాభివృద్ధి : కూటమితోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందని గుమ్మనూరు జయరాం అన్నారు. మండలంలోని నీలూరు, తంబళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తంబళ్లపల్లి గ్రామానికి వంకలో బ్రిడ్జి నిర్మాణానికి తోడ్పడతానన్నారు. తంబళ్లపల్లి గ్రామంలో టీడీపీలోకి 10 కుటుంబాలు గుమ్మనూరు జయరాం సమక్షంలో చేరాయి. ఆయా కుటుంబాలకు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు కేసీ హరి, ప్రభాకర్ చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, గౌస్‌పీరా, సంజీవకుమార్, ముసలిరెడ్డి, అప్పన్నగారి కుమార్, ఆర్ఆర్ రమేష్ పాల్గొన్నారు.

గుత్తి: అరాచక అవినీతి పాలన నుంచి మరో మూడు రోజుల్లో విముక్తి కలిగించేందుకు మీ ఓటుతో వైసీపీని తరిమికొట్టాలని గుంతకల్లు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం సాయంత్రం స్థానిక రాజీవ్ సర్కిల్ వద్ద నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఆధ్వర్యంలో భారీగా రోడ్‌షో నిర్వహించారు. ఈ రోడ్‌షో గాంధీ సర్కిల్, సీఎస్ఐ చర్చి మీదుగా కొనసాగింది. కార్యకర్తలు తప్పట్లతో చిందులు వేస్తూ ఘనంగా ర్యాలీలో పాల్గొన్నారు. అభ్యర్థులు ప్రజలకు అభివాదం చేస్తూ కొనసాగారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ నుంచి ప్రజలు విసిగిపోయారన్నారు. వారు పెట్టిన అరాచకాల నుంచి బేజారు అయ్యారన్నారు. వైసీపీకి అంతం ప్రారంభమైంది. మరో మూడు రోజుల్లో జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలపించాలని, టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక వైసీపీ నాయకులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీఓ కాపీలను చింపివేశారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, కేసీ హరి, బద్రివలి, దిల్కాశీనా, న్యాయవాది సోమశేఖర్ పాల్గొన్నారు.



గుత్తి రోడ్‌షోకు భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

ప్రజలను మోసగించేందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు

ఉరవకొండ, మే 10: రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ విమర్శించారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీవ్రమైన అభద్రతకు గురిచేసే చట్టంగా ఉందన్నారు. దీనిని టీడీపీ ఆహ్వానించిందని సజ్జలరామకృష్ణారెడ్డి శాసనసభలో తాను మాట్లాడిన వీడియోను విడుదల చేశారన్నారన్నారు. రాష్ట్ర ప్రజానికానికి వాస్తవాలు చెప్పాల్సిన అవసరముందన్నారు. 2019లో శాసన సభలో చర్చ సందర్భంగా తాను మాట్లాడిన కొన్ని మాటలను మాత్రమే విడుదల చేశారని పేర్కొన్నారు. అసలు విషయం పక్కన పెట్టారన్నారు. 2022-23 సంవత్సరంలో చట్టం తెచ్చారని శాసనసభలో చర్చించడానికి టీడీపీ సభ్యులు అడిగితే ఇవ్వనని చెప్పారని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ యాక్టును రద్దుచేస్తామన్నారు. రహంతుల్లా, నిరంజన్‌గౌడ్, బాలాజీ, మారెన్న, యూనిస్, సుదర్శన్, వరప్రసాద్, గోపాల్ పాల్గొన్నారు.

బీటీపీకి నీరివ్వడం సీఎంకు ఇష్టం లేదు: కాపు

రాయదుర్గం, మే 10: భైరవానతిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలను మళ్లించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఇష్టం లేదని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కళ్యాణదుర్గానికి ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన సీఎం జగన్ బీటీపీ గురించి ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం దీనికి నిదర్శనమన్నారు. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మెట్టు గోవిందరెడ్డిని గెలిపిస్తే శాశ్వతంగా నీరు రావని వెల్లడించారు. పైగా అతనికి సీఎంకు ఒప్పించి నీరు తెప్పించే సత్తా లేదన్నారు. బీటీపీకి కృష్ణాజలాలు తెప్పించే సమర్థత కూటమికి మాత్రమే ఉందన్నారు. అందుకే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

నగదు పట్టివేత

కుందుర్పి, మే 10: కుందుర్పి ఎస్ఐ వెంకటస్వామి విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా కారులో రూ.కోటి నగదు దొరకడంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం తెలిపారు. విచారణ అనంతరం అమరాపురం కెనరా బ్యాంక్ సీనియర్ బ్యాంకు మేనేజర్ ప్రహల్లాదరావు, బ్యాంకు అటెండర్ రవి అనంతపురం కరెన్సీ చెస్ట్ వారికి సదరు డబ్బులను తీసుకుని వెళుతున్నారని, ఆ డబ్బుకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించగా అన్ని సరిగా ఉన్నందున ఎఫ్ఎస్‌టీ సిబ్బందికి ఆర్‌వో తెలిపిన ఆదేశాల మేరకు నగదును రిలీజ్ చేసినట్లు రూరల్‌సీఐ నాగరాజు, ఎస్ఐ వెంకటస్వామి, తహసీల్దార్ హనుమంతు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, మే 10: గుమ్మఘట్ట మండలం బేలోడు గ్రామానికి చెందిన మల్లికార్జున కర్ణాటకలోని తిమ్మలాపురం గ్రామానికి చెందిన అంజినేయ అనేవ్యక్తులు కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. రెండు బాక్సులు కర్ణాటక మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి ఇద్దరుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు కాలవ పర్యటన ఇలా...

రాయదుర్గం, మే 10: కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు శనివారం రాయదుర్గం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమంటపంలో ఏర్పాటు చేసిన ఆల్ మర్చెంట్స్ అసోసియేషన్ సమావేశంలో ఉదయం 8 గంటలకు పాల్గొంటారు.

యానిమేటర్ల తొలగింపు

ఉరవకొండ, మే 10: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 8 మంది యానిమేటర్లను తొలగిస్తూ డీఆర్‌డీఏ పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో మాజీ ఎంపీపీ చంద్రమ్మ యానిమేటర్లతో రహస్య సమావేశాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు 8మందిని విధుల తొలగించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి



కొండాపురంలో ఓటు అభ్యర్థిస్తున్న ప్రభాకర్‌చౌదరి

పుట్లూరు, మే 10: చంద్రబాబునాయుడును మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని టీడీపీ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. మండలంలోని ఏ.కొండాపురం, అరకటవేముల, సూరేపల్లి, మడ్డిపల్లి, ఓబులాపురం, కడవకల్లు, కొండుగారికుంట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి నాయకులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, బండారు శ్రావణిశ్రీలను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయన వెంట చంద్రదండు అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, సుదర్శన్‌నాయుడు, సోమశేఖర్‌నాయుడు, రామాంజనేయులు, నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

యల్లనూరు: తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి మండలంలో శుక్రవారం టీడీపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. కూచివారిపల్లి, వాసాపురం గ్రామాల్లో ఆయన ఇంటింటికి తిరిగి టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట వాసాపురం నరేంద్ర నాయుడు, కూచివారిపల్లి సంజీవరాయుడు, కార్యకర్తలు ఉన్నారు.

వైసీపీకి ఓటు వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ ప్రచారం

విడపనకల్లు, మే 10: మండలంలోని వేల్పుమడుగు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ శుక్రవారం వైసీపీ ప్రచారంలో పాల్గొని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. శుక్రవారం వైసీపీ నాయకులు వేల్పుముగు గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ ప్రచరంలో పాల్గొని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశాడు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు.



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ (వృత్తంలో..)

2519 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు

గుంతకల్లుటౌన్, మే 10: పట్టణంలో శుక్రవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2519 మంది ఉద్యోగులు, పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వేపల్లి రాధకృష్ణ మున్సిపల్‌పాఠశాలలో మూడు, ఆర్వో కార్యాలయంలో ఒక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3068 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులు, ఆర్టీసీ ఉద్యోగులకు గాను పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2519 ఓటును వినియోగించుకున్నట్లు ఆర్వో శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ ప్రచారం

విడపనకల్లు, మే 10: మండలంలోని పాల్తూరు గ్రామంలో ఉపాధి కూలీలకు మీ ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ గురుస్వామి శుక్రవారం ప్రచారం చేశారు. దీనిపై కొంత మంది కూలీలు టీడీపీ నాయకులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కూలీలు పనులు చేస్తున్న స్థలానికి చేరుకునే సరికి అక్కడి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ పరారైనట్లు కూలీలు తెలిపారు. దీనిపై ఎంపీడీఓ కొండయ్యను వివరణ కోరగా విచారించి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

బొమ్మనహాళ్, మే 10: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం 6 గంటలకు శ్రీవారికి పంచామృతాభిషేకం, దీక్షాహోమం, బలిహరణ, ఉదయం 10 గంటలకు రథాంగ హోమం, రథబలి, మడుగు రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారిని పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించి స్వామివారి రథోత్సవంపై ఆశీనులు చేసి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, ప్రజలు రథాన్ని లాగారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం సెంట్రల్, మే 10: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ నాల్గో సంవత్సరం విద్యార్థుల పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ సత్యనారాయణ తన కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల మూడో తేదీ వరకు ద్వితీయ సెమిస్టర్ (ఆర్ 20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించామని, వారం లోపే మూల్యాంకణం చేయించి ఫలితాలను విడుదల చేశామని అన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. కాగా, ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌కు వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు మొత్తం పూర్తిగా చెల్లిస్తేనే ఫలితాలు చూపిస్తామని, సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యం చెబుతుండటంతో వారు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం ఫీజు మొత్తాన్ని విడుదల చేయకుంటే తామెలా కట్టాలని తల్లిదండ్రులు వాపోతున్నా... ఫీజు కట్టాల్సిందేనని కళాశాల యాజమాన్యం పట్టుపడుతోంది.

తాడిపత్రిలో ఎగిరేది పసుపు జెండానే

● మేనిఫెస్టోతో తాడిపత్రి రూపురేఖలు మారతాయి

● నేను ఎక్కడికీ పోను ఇక్కడే ఉంటా: జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మే10: ఎన్నికల ఫలితాల్లో తాడిపత్రిలో ఎగిరేది పసుపు జెండానే, గెలిచేది జేసీ అస్మిత్‌రెడ్డే అని, వచ్చే ఐదేళ్లల్లో అభివృద్ధి అంటే ఏమిటో నా బిడ్డ చేసి చూపిస్తాడని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. పట్టణంలోని సీబీరోడ్డు, అశోక్‌పిల్లర్, మెయిన్‌బజారు, నవరంగ్ టాకీస్‌రోడ్డు, పోలీస్‌స్టేషన్‌రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. ర్యాలీలో మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, జేసీ పవన్‌రెడ్డి, కూటమి అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి ప్రతి ఒక్కరిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. ప్రతి షాపువద్దకు వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటువేయాలని యజమానులను అభ్యర్థించారు. మెయిన్‌బజారులో నిర్వహించిన సభలో జేసీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఆదరించిన విధంగానే నా బిడ్డ అస్మిత్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. సైకో జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. విజన్ ఉన్న చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. గాంధీసర్కిల్‌లో జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లక్రితం జరిగిన ఎన్నికల్లో రాష్ట్రమంతా వైసీపీ గెలిచినా తాడిపత్రిలో మాత్రం నన్ను గుర్తుంచుకొని గెలిపించారని, ఇప్పటికీ ప్రతిరోజూ తాను గుర్తు చేసుకుంటానని భావోద్వేగానికి లోనయ్యారు. ఇక్కడి ఎమ్మెల్యే ఎన్నికల తర్వాత అందరిని నరుకుతాడంట, నరకడానికి ఏమైనా పుచ్చకాయలు అనుకున్నాడేమో ఆయనకు చెట్లను నరకడం బాగా తెలుసునని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత తాము ఎక్కడికో వెళ్లిపోతామని అవాకులు చెవాకులు చెప్పే ప్రతి ఒక్కరికి ఇదే చెబుతున్నా నా మనవళ్లు కూడా రెడీ అవుతున్నారని ఎలాంటి అపోహలు, సందేహాలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు.



ర్యాలీలో ప్రజలకు నమస్కరిస్తున్న జేసీ దివాకర్‌రెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

జేసీ అస్మిత్‌రెడ్డి గెలుపు ఖాయమైంది : పవన్‌రెడ్డి

మీ ప్రేమ, అభిమానం చూస్తుంటే అస్మిత్‌రెడ్డి గెలుపు ఖాయమైందని పవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో తాను జ్యోతిష్యం నేర్చుకున్నానన్నారు. ఈ సందర్భంగా జేసీ అస్మిత్‌రెడ్డి చేయిచూసి చెబుతూ నా తమ్ముడు, నాన్న దివాకర్‌రెడ్డి కన్నా రెండుసార్లు పైగానే ఎమ్మెల్యేగా గెలుపొంది మీకు సేవ చేస్తాడని తెలిపారు. ప్రచారంలో వస్తున్న ఆదరణ చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. తమ కుటుంబానికి మైనార్టీలు ఎల్లప్పుడూ అండగా ఉన్నారన్నారు. ఎన్నికలరోజు ప్రతి ఒక్కరూ అందరితో ఓటు వేయించాలని కోరారు. జేసీ అస్మిత్‌రెడ్డి తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నాడని అందువల్ల మాట్లాడలేకపోతున్నాడని తెలిపారు. గెలిచిన తర్వాత ఇదే సెంటర్‌లో విజయోత్సవ సభలో ఆయన మాట్లాడతాడని తెలిపారు.